# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 22 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:176 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM










# యోగాతో ప్రపంచ శాంతి..

## అశాంతి.. అస్థిరత నెలకొన్న జగతికి యోగాయే శరణ్యం

### యోగా ఫర్ వన్ ఎర్త్.. ఫర్ వన్ హెల్త్ కోసం ఏకమవుదాం

- వంటల్లో నూనె వాడకం తగ్గించాలి
- ఏపీలో యోగాంధ్రా ఎంతో అద్భుతం
- సోషల్ సెలబ్రేషన్స్ చేయడంపై ప్రశంసలు
- యోగా డేలో పాల్గొన్న భారత ప్రధాని
- స్థానికులతో కలిసి ఆసనాలు వేసిన మోడీ




**విశాఖపట్నం, జూన్ 21 సెంట్రల్ డెస్క్‌:** ప్రపంచ వ్యాప్తంగా అశాంతి, అస్థిరత్వం పెరుగుతోంది. కేవలం యోగాతో శాంతి, సుస్థిర సాధ్యమవుతుంది. అందుకే యోగా ప్రపంచాన్ని కలిపిందని, 175 దేశాల్లో యోగా సాధన సామాన్య విషయం కాదు. యోగా ఫర్ వన్ ఎర్త్, ఫర్ వన్ హెల్త్ అనే థీమ్ లోతైన సత్యాన్ని ప్రతిబింబించిందని ప్రధాని మోదీ అన్నారు. కేవలం భారత్‌తోనే ఇది సాధ్యమైందని.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని యోగా వైపు కదిలించిందని అన్నారు. యోగాకు వయో పరిమితి, హద్దులు లేవని స్పష్టం చేశారు. విశాఖపట్నం సాగరతీరంలో శనివారం ఉదయం జరిగిన పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ, ప్రపంచ ప్రజలకు అంతర్జాతీయ యోగా డే శుభాకాంక్షలు. యోగా మనలో మానవత్వాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందింపజేస్తుంది. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. అంతేకాదు.. వ్యక్తిగత క్రమశిక్షణకూ ఓ అద్భుత సాధనం. ఆధునిక పరిశోధనల్లోనూ ఇది నిరూపితమైంది. యోగాతో గడచిన 11 ఏండ్లలో 12 కోట్ల మంది జీవనశైలిలో మార్పు వచ్చింది. 175 దేశాల్లో యోగా పాటించడమంటే మామూలు విషయం కాదు. అశాంతి, అలజడి పెరుగుతున్న తరుణంలో యోగాతో ప్రపంచానికి శాంతి చేకూరుతుంది అని ప్రధాని మోడీ అన్నారు. అందరి క్షేమమే మన కర్తవ్యమని భారతీయ సంస్కృతి చెబుతోంది. అది యోగాతోనే సాధ్యం.. యోగా సాధన ద్వారా జీవితాల్లో వెలుగులు నింపుతుంది. ప్రతి గ్రామంలో యోగా ఆవశ్యకతపై అవగాహన పెరుగుతోంది.

**యోగాతో ఒబేసిటీ పరార్**

యోగా వన్ ఎర్త్.. వన్ హెల్త్ నినాదం పూర్తి స్థాయిలో విజయవంతం అవుతుందన్న విశ్వాసం నాకుంది. అని ప్రధాని మోదీ అన్నారు. యోగా మానవ శరీరంతో మిళితమై ఉంది. ఇది ఏ ఒక్కరికో పరిమితం కాకూడదు. సమాజంలో అన్ని వర్గాలకు చేరువ కావాలి. యోగా సర్వేజనా సుఖినోభవంతు.. అనే నినాదంగా మారాలి.. అని ప్రధాని అన్నారు. డిజిటల్ టెక్నాలజీలోనూ యోగా ముఖ్య భూమిక పోషిస్తోంది. యోగాను మెడికల్ కాలేజీల్లోనూ ప్రవేశపెట్టడంతో పాటు కామన్ యోగా ప్రోటోకాల్‌ను తయారు చేస్తున్నాం. యోగాను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ యోగాతో రోజు మొదలవ్వాలి అని మోదీ పేర్కొన్నారు. వంటల్లో నూనె వాడకాన్ని పదిశాతం తగ్గించాలని.. భారత్‌తో పాటు ప్రపంచ దేశాల ప్రజలకు సూచించారు. ఆరోగ్యానికి ఇది మేలు చేస్తుందని చెప్పారు. ప్రపంచాన్ని స్థూలకాయం (ఒబేసిటీ) ఓ పెద్ద సమస్య వేధిస్తోంది. ఈ తరుణంలో యోగాతో పాటు

...మిగతా 2లో

## ఏపీలో యోగాంధ్ర అద్భుతం..

ప్రకతి సౌందర్యానికి, ప్రగతి విశాఖపట్నం చిరునామా అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని అద్భుతంగా ఏర్పాటు చేసిందని... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇందుకోసం చొరవ చూపారని ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌పై ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసల వర్షం కురిపించారు. లోకేష్ యోగాంధ్ర కార్యక్రమం కోసం చాలా కషి చేశారని అన్నారు. యోగాను సోషల్ సెలబ్రేషన్‌గా ఎలా నిర్వహించాలి, సమాజంలోని అన్ని వర్గాలను అందులో ఎలా భాగస్వాములను చేయాలనే దాన్ని గత నెలన్నర రోజులుగా యోగాంధ్ర ద్వారా చేసి చూపించారని ప్రశంసించారు. ఇటువంటి ఒక సామాజిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా దేశ ప్రజలందరికీ ఈ కార్యక్రమాన్ని ఒక నమూనాగా నిలిపారని లోకేష్‌ను మోదీ కొనియాడారు.





## విశాఖ ప్రకృతి.. ప్రగతి సంగమ స్థలి

ఇదో ప్రకతి, ప్రగతి సంగమ స్థలి విశాఖపట్నం అని ప్రధాని మోడీ అభివర్ణించారు. విశాఖ ప్రజలు చాలా మంచి వారని కొనియాడారు. నెల రోజుల వ్యవధిలోనే విశాఖలో యోగా ఏర్పాట్లు పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, అధికారులు విజయవంతమయ్యారని అభినందించారు. ప్రధాని మోదీ 19 నిమిషాల పాటు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అంతర్జాతీయ యోగా డే పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.మోదీ, చంద్రబాబు, పవన్‌లు యోగాసనాలు.. మరోవైపు ప్రధాని ప్రసంగం అనంతరం ఉదయం 7.10 గంటలకు ఆర్కే బీచ్‌లోని యోగా డే ప్రధాన వేదిక వద్ద ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో పాటు మంత్రి లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణిలు కూడా యోగాసనాలు చేశారు. ప్రధాని సహా వీరంతా యోగా అభ్యాసకుల మధ్యలోనే యోగాసనాలు చేపట్టారు. 45 నిమిషాల సేపు యోగాసనాలు జరిగాయి. వేదికపై నుంచి యోగా శిక్షకుడు ఆసనాలను సూచిస్తుండగా వీరు ఆచరించారు. యోగాసనాలు ఓంకారంతో మొదలు పెట్టి ఓంకారంతోనే ముగించారు.

## యోగా మన సంస్కృతిలో భాగం

### మంత్రి నాదెండ్ల

**తెనాలి, జూన్ 21(మనం ప్రతినిధి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా, తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా యోగా కార్యక్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా మంత్రి యోగా మాస్టర్ల సూచనల మేరకు పలు రకాల ఆసనాలను చేయడమేకాక, పాల్గొన్న ప్రజలకు ఉత్సాహాన్నిచ్చారు. ఉదయం 6.30 గంటలకే పెద్ద సంఖ్యలో ప్రజలు, ఉద్యోగులు, యువత పాల్గొని దాదాపు ఒక గంటపాటు యోగాసనాలు అభ్యసించారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి ఔషధాల అవసరం లేకుండా జీవించేందుకు యోగా ఒక మంచి మార్గం అన్నారు. యోగా మన సంస్క ృతి లో భాగం అని, ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది,

...మిగతా 2లో



## యోగాంధ్ర-2025 విజయవంతం కావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం

### యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపు

**విశాఖపట్నం, జూన్ 21 (మనం ప్రతినిధి):** విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రజల సహకారంతో విజయవంతం కావడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్క ృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం

...మిగతా 2లో



## సంగీత నృత్య నిరాజనంలో నటరాజ నంది అవార్డు కైవసం చేసుకున్న కీర్తిక వర్మ



**తిరుపతి,జూన్ 21,మనం న్యూస్:** హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నృత్య నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ మరియు సిరి ఆరట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత నృత్య నీరాజనం - 2025 అనే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తిరుపతిలో సిల్వర్ ఓక్స్ విద్యాలయంలో మూడవ తరగతి చదువుతున్న గల్లా మహేష్, చంద్రకళల కుమార్తె గల్లా కీర్తిక వర్మ సంగీత నృత్య నిరాజనంలో పాల్గొని ఆమె తన ఉత్తమ ప్రతిభతో అందరిని ఆకట్టుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగానూ నిర్వాహకులు ఆమెకు నటరాజ నంది అవార్డును బహుమతిగా ప్రదానం చేసి సత్కరించారు.

## ఇజ్రాయెల్‌కు అంత సీన్ లేదు

### మా సాయం లేకుండా టెల్‌అవీవ్ అణుదాడి చేయలేదన్న ట్రంప్

**న్యూజెర్సీ, జూన్ 21:** ‘మా సాయం లేకుండా ఫోర్డోలోని భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్ కు లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. శుక్రవారం (స్థానిక కాలమానం ప్రకారం) న్యూజెర్సీలో విలేకరులతో మాట్లాడుతూ ఆయనీ విషయం వెల్లడించారు. ఒకవేళ వారు దాడులు చేసినా అది పెద్ద ప్రభావం చూపించవన్నారు. వారికి అంత సీన్ (సామర్థ్యం) లేదన్నారు. ఈసందర్భంగా తాను దౌత్యానికి కట్టుబడి ఉన్నానని చెప్పిన ఆయన.. సైనిక కార్యకలాపాలను ఆపేయాలని ఇజ్రాయెల్ ను ఒప్పించడం ప్రస్తుతానికి అసంభవమన్నారు. ఎవరైనా గెలుస్తుంటే ఇలాంటి అభ్యర్థనలు చేయడం కష్టమని తాను

...మిగతా 2లో

## మా అణుకేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది

- యుద్ధ విమానాలతో చేసిన ఇజ్రాయెల్ దాడుల వల్ల తీవ్ర నష్టం
- వెల్లడించిన ఇరాన్ అధికార వర్గాలు



**టెహ్రాన్, జూన్ 21:** తమ దేశంలోని కీలక ఇస్ఫహాన్ అణు కేంద్రం లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడి చేసిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. దాడులు జరిగిన ప్రదేశంలో అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే పరికరాలు, ప్రాజెక్టులు ఉన్నట్లు తెలిపారు. టెహ్రాన్ సహా ఇరాన్లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. పశ్చిమ ఇరాన్లోని బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు

...మిగతా 2లో



# అశాంతి.. అస్థిరత నెలకొన్న జగతికి యోగాయే శరణ్యం

(మొదటి పేజీ తరువాయి)

వంట నూనెల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఒబేసిటీని అదుపు చేయవచ్చు' అని ప్రధాని వివరించారు.

**దివ్యాంగుల పరిశోధన గర్వంగా ఉంది**

''దివ్యాంగ స్నేహితులు బ్రెయిలీలో యోగా శాస్త్రాలను అధ్యయనం చేస్తున్నారని తెలిసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. శాస్త్రవేత్తలు అంతరిక్షంలో యోగా సాధన చేస్తారు. యువ స్నేహితులు గ్రామాల్లో యోగా ఒలింపియాడ్‌లలో పాల్గొంటారు. ఈ నేవీ నౌకలన్నింటిలోనూ అద్భుతమైన యోగా కార్యక్రమం ప్రదర్శించబడుతోంది. ఒపెరా హౌస్ మెట్లు అయినా, ఎవరెస్ట్ శిఖరం అయినా, సముద్ర విస్తీర్ణం అయినా... ప్రతిచోటా యోగా అందరికీ అనే ఒకే సందేశం వస్తుంది. సరిహద్దులు, నేపథ్యం, సామర్థ్యానికి అతీతంగా యోగా నిలుస్తుంది'' అని మోదీ తెలిపారు.




విశాఖ యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డు సష్టించింది. యోగాలో సూరత్ రికార్డును అధిగమించింది. గిన్నిస్ బుక్ ప్రతినిధులు రికార్డులకు సంబంధించిన పత్రాలు, జ్ఞాపికలను మంత్రులకు, అధికారులకు అందజేశారు.

## యోగా మన సంస్కృతిలో భాగం

(మొదటి పేజీ తరువాయి)

అని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు. ఈ మహా కార్యక్రమానికి విశాఖపట్నంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై, యోగా ప్రాధాన్యతను భారతదేశం నుండి ప్రపంచానికి యోగాను పరిచయం చేయడం గర్వకారణం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్షకు పైగా ప్రదేశాల్లో, దాదాపు రెండు కోట్ల మంది ప్రజలు ఈ యోగ దినోత్సవంలో పాల్గొన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు గత నెల రోజులుగా విస్తృతంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేశాం. ఇది ప్రజల మద్దతుతో విజయవంతమైంది, అని పేర్కొన్నారు. కార్యక్రమంలో 70 ఏళ్ల పైబడిన వృద్ధులు కూడా యోగా చేయడమే కాక, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అనంతరం వారిని యోగా గురువులను మంత్రి ఘనంగా సన్మానించారు.



## యోగాంధ్ర-2025 విజయవంతం కావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. యోగాంధ్ర - 2025 (యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్) పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మే 21 నుండి జూన్ 21 ప్రపంచ యోగ దినోత్సవం వరకు నెల రోజుల పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయన్నారు.భారీ ఎత్తున ప్రజల నుండి స్పందన రావడం, విశాఖలోని ఆర్ కే బీచ్ నుండి భోగాపురం వరకు దాదాపు 3 లక్షలకు పైగా ప్రజలు ఒకే వేదికపై యోగా అభ్యసనం చేయడం అ న ా ,ద ా ం ణ ు ా ు న విషయమన్నారు.ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగించే యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.యోగా మన వారసత్వ సంపద అని గుర్తుచేశారు. ప్రపంచానికి మన దేశం అందించిన గొప్ప వరం యోగా అని కీర్తించారు. ప్రస్తుత జీవనశైలికి,సమస్యలకు యోగా చక్కని పరిష్కార మార్గమని సూచించారు. ఈ యోగాంధ్ర కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ వేదికపై మరోసారి ఇనుమడింపజేసిందన్నారు. ఇదొక చారిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సహచర మంత్రులు, అధికార యంత్రాంగం,ప్రజలతో కలిసి యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## చేవెళ్ల కోర్టు లో ఘనంగా యోగా డే

**చేవెళ్ల, జూన్ 21 (మనం న్యూస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కోర్టు ఆవరణలో చేవెళ్ల న్యాయవాదులు యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగ చేవెళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యోగ వల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలున్నాయనీ ఇది ఒత్తిడిని తగ్గించడమే కాకుండా ఏకాగ్రతను పెంచుతుంది, శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, శరీర దృఢత్వాన్ని పెంచుతుంది మరియు నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది అని అన్నారు. అంతే కాకుండా యోగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది, అలాగే శరీర బరువును నియంత్రించడంలో కూడా ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహేష్ గౌడ్ , ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్స్ తలారి ప్రకాశం, శివరాజ్ గౌడ్ మరియు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## మేడే కాల్‌తో ప్రమాదం తప్పించుకున్న ఇండిగో విమానం

**గౌహతి, జూన్ 21:** ఇండిగో విమానం ఒకటి తృటిలో ప్రమాదం తప్పించుకుని 'మేడే కాల్'తో సురక్షితంగా బయటపడింది. గౌహతి నుంచి చెన్నైకి వెళుతున్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు సంబంధిత వర్గాల సమా చారం ప్రకారం.. అసోం రాజధాని గౌహతి నుంచి చెన్నైకి బయలుదేరిన ఇండిగో విమానంలో టేకాఫ్ అయిన కాసేపటికి ఇంధనం తక్కువగా ఉండడాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే పైలట్ ఏటీసీకి 'మేడే' సందేశం పంపారు. తక్షణమే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. దీంతో విమానానికి ప్రమాదం తప్పింది. ఈ ఘటన మూడు రోజుల క్రితం చోటు చేసుకోగా.. తాజాగా వెలుగులోకి వచ్చింది.

## మా అణుకేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కాస్పియన్ సముద్రం సమీపంలోని రాస్త్ నగరంపైనా టెల్‌అవీవ్ బాంబులతో విరుచుకుపడింది. దీనికి ప్రతిగా ఇరాన్ చేస్తున్న దాడుల్లో గోలన్ హైట్స్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్లు మోగుతున్నాయి. ఇరాన్ ప్రయోగించిన అనేక డ్రోన్లను జనావాసాలు లేని ప్రాంతాల్లో కూల్చివేయడంతో ప్రజలకు ఎటువంటి హానీ జరగలేదని ఇజ్రాయెల్ తెలిపింది. శుక్రవారం ఐడీఎఫ్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ పాలనను అస్థిరపరచడానికి దాడులను మరింత తీవ్రతరం చేయాలని సూచించారు. ఇరాన్ ప్రభుత్వ కేంద్రాలు, సంస్థలు, మౌలిక సదుపాయాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకోవాలన్నారు. టెహ్రాన్‌లోని శక్తిమంతమైన బాసిజ్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కేంద్రాలను ధ్వంసం చేయాలని సూచించారు. మరోవైపు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి తీసుకోవాల్సిన దౌత్యపరమైన నిర్ణయాలపై చర్చలు జరిపేందుకు యూరోపియన్ విదేశాంగ మంత్రులు ఇప్పటికే ఇరాన్ విదేశాంగ శాఖతో చర్చలు జరుపుతుండడం గమనార్హం.

## ఆ ముగ్గురు సీనియర్లను తొలగించండి

**ఎయిరిండియాకు డీజీసీఏ ఆర్డర్**

**విధుల నిర్వహణలో అలక్ష్యం కారణంగానే అహ్మదాబాద్ విమాన ప్రమాదం!**

**ఢిల్లీ, జూన్ 21:** అహ్మదాబాద్‌లో బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక నిర్ణయం తీసుకున్నది. ఎయిరిండియాలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. ముగ్గురు అధికారులు సిబ్బంది షెడ్యూల్, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ''నిబంధనలు సరిగా పాటించకపోవడం వల్లే వారిపై చర్యలకు డీజీసీఏ ఉపక్రమించింది. లైసెన్సింగ్, సర్వీసింగ్ లోపాలు ఉన్నా ఎయిరిండియా విమాన సిబ్బందిని షెడ్యూల్ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎయిర్లైన్స్ వెల్లడించిన విషయాల ఆధారంగా అలసత్వంగా వ్యవహరించిన అధికారులపై వేటు వేయాలని సిఫార్సు చేసింది. నిబంధనలు పాటించకుండానే షెడ్యూల్ చేశారు. అంతేకాకుండా, వారు ఈ తప్పిదాలపై జవాబుదారీతనంతో వ్యవహరించలేదు. ఎలాంటి జాప్యం చేయకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీసీఏ పేర్కొంది. వెంటనే వారిపై అంతర్గత క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యలను 10 రోజులలోపు డీజీసీఏకి నివేదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది'' అని వెల్లడించారు.

## యోగాను జీవన విధానంగా మార్చుకోవాలి

- **యోగతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది**
- **యోగాతో ఉద్యోగులు కూడా ప్రశాంతత పొందుతారు**
- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నల్లగొండ, జూన్ 21 (మనం ప్రతినిధి): యోగాను జీవన విధానంగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. 11 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని రామగిరి లో ఉన్న ఎం.వి.ఆర్ కాన్సెప్ట్ పాఠశాలలో ఆయుష్ శాఖ, జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ, పతంజలి యోగ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక స్థిరత్వాన్ని సాధించవచ్చని, దీనికి తోడుగా సాత్విక ఆహారం, మంచి అలవాట్లతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. యోగ వల్ల ఆరోగ్యంతో పాటు, పనిపై శ్రద్ధ కలుగుతుందని, జిల్లా యంత్రాంగం తరఫున అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు అల్పాహారం, జ్ఞానం , శారీరక శ్రమతో పాటు, మానసిక ప్రశాంతత అలవాటు చేసుకోవాలని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పని చేసినట్లయితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. ప్రతినిత్యం వత్తిడులతో గడిపే ఉద్యోగులకు యోగ తప్పనిసరి అని, దీని ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ,తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగ విన్యాసాలను ప్రదర్శించగా, కొంతమంది చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ యోగా గురువులకు సన్మానం చేసి ప్రశంస పత్రాలను అందజేశారు. ఆర్డీవో అశోక్ రెడ్డి,ఇంచార్జ సి ఈ ఓ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్‌కు అంత సీన్ లేదు

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నట్లు తెలిపారు.ఇజ్రాయెల్ అద్భుతంగా యుద్ధం చేస్తోంది..ఈ క్రమంలో యుద్ధంలో టెల్‌అవీవ్ అద్భుతమైన దాడులు చేస్తుండగా.. టెహ్రాన్ వి పేలవంగా ఉన్నాయన్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య మధ్యవర్తిత్వం వహించడానికి యూరోపియన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ట్రంప్ తోసిపుచ్చారు. వారు సాయం చేయలేరని వ్యాఖ్యానించారు. ఇరాన్ యూరప్ తో కాకుండా అమెరికాతో చర్చలు జరపాలనుకుంటున్నదని ట్రంప్ చెప్పారు.

## 27న కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం

- **ఖరీఫ్‌కు నీటి విడుదలే ప్రధాన అజెండా**

**హైదరాబాద్,** మనం ప్రతినిధి:రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఒక కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 27న ప్రత్యేకంగా సమావేశం కానుంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో ప్రధానంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు ఖరీఫ్ సీజన్ అవసరాల నిమిత్తం నీటి విడుదలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇరు రాష్ట్రాల వాటాలు, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు పోను సాగునీటికి ఎంత కేటాయించాలనే అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చించనున్నారు. ఈ మేరకు కేఆర్ఎంబీ ఇప్పటికే తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చింది. రెండు రాష్ట్రాల అధికారులు తమ తమ రాష్ట్రాల అవసరాలు, డిమాండ్లను ఈ సమావేశంలో బోర్డు ముందు ఉంచనున్నారు.

## పటాన్ చెరులో యోగాకు విశేష ఆదరణ

- **ఎమ్మెల్యే 'గూడెం' అధ్వర్యంలో ఘనంగా యోగా డే వేడుకలు**
- **వేలాది మందితో కిక్కిరిసిన మైత్రి మైదానం**
- **రెండున్నర గంటల పాటు సాగిన కార్యక్రమం**
- **పాల్గొన్న 'మనం' దిన పత్రిక ఎడిటర్ ఉప్పరి రమేష్**




**రామచంద్రపురం,జూన్ 21(మనం న్యూస్):** పటాన్ చెరు పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మైత్రి మైదానంలో భారీ ఎత్తున యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పటాన్ చెరు చరిత్రలోనే మొట్ట మొదటిసారి వేలాది మందితో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. యోగ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు, లీడర్లు, విద్యార్థులు వేలాదిగా పాల్గొనడంతో మైత్రి మైదానం కిక్కిరిసింది. అందరూ ఎంతో ఉత్సాహంతో పాల్గొని యోగాసనాలు చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యోగా ఆసనాలు వేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. మనం దినపత్రిక ఎడిటర్ ఉప్పరి రమేష్ కార్యక్రమంలో పాల్గొని యోగా చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డిఎస్పి ప్రభాకర్, భారత స్వాభిమాన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పూరి శివుడు, యోగ గురువు శివకుమార్, నర్ర బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి , బాల్ రెడ్డి ,విజయ్ కుమార్, హనుమంత్ రెడ్డి, నాయికోటి భోజయ్య తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది



- **చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం**

**చేవెళ్ల, జూన్ 21(మనం న్యూస్ ):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చేవెళ్లలో ఘనంగా నిర్వహించారు. శనివారం చేవెళ్ల భాజపా పార్టీ ఆధ్వర్యంలో కేవీఆర్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కెఎస్ . రత్నం హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా అనేది ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఒక ఆధ్యాత్మిక, శారీరక సాధన అన్నారు. ఇది శరీరం, మనస్సు, శ్వాసను కలిపి మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును పెంపొందించడంపై దృష్టి పెడుతుందన్నారు. టెక్నాలజీ పెరగడంతో పని తగ్గిందని, తద్వారా రోగాలు పెరుగుతున్నాయన్నాయని చెప్పారు. ప్రతిరోజు యోగ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రోగాలు తగ్గుతాయని తెలిపారు. పంచభూతాలు మన శరీరంలో సక్రమంగా పని చేసినప్పుడే రోగం మన దరిచేరకుండా ఉంటుంది, మానసిక ఒత్తిడి దూరమవుతుందని వెల్లడించారు. శ్వాస వ్యాయామాలు మనస్సును శాంతపరచడానికి, శరీరంలో శక్తి ప్రవాహాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అందరి జీవనవిధానంలో యోగా ఒక భాగం కావాలి

అన్ని విద్యాలయాలలో యోగా తప్పనిసరి చేయాలి

జిల్లా వ్యాప్తంగా 6200 ప్రాంతాల్లో 11వ ప్రపంచ యోగా దినోత్సవ నిర్వహణ

జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్

యోగా ద్వారా సమాజంలో సానుకూల,ఆరోగ్యకర దృక్పథం అలవడాలి

యువత సామాజిక రుగ్మతల నుండి బయటపడాలి

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




**తిరుపతి, జూన్21,మనం న్యూస్:** అందరి జీవనవిధానంలో యోగా ఒక భాగం కావాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ తారకరామ స్టేడియంలో ఏర్పాట్లు చేసిన 11వ ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఎస్వీ, వేదిక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్లు ఆచార్య అప్పారావు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలసి యోగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో యోగాంధ్ర-2025 లో 10 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని 6200 ప్రాంతాల్లో సుమారు 9 నుంచి 10 లక్షల మంది పాల్గొంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోనిర్వహించామన్నారు. నేడు భారత ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో రాష్ట్ర ముఖ్యమంత్రితో కలిసి పాల్గొంటున్నారని ఆ కార్యక్రమాన్ని సుమారు 5 లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది అన్నారు. మన సంస్కృతిలో యోగాకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. శారీరక, మానసిక,ఆధ్యాత్మిక శ్రేయస్సును అందించే సాధనంగా ప్రాచీన కాలం నుండి కొనసాగుతూ ఉందన్నారు. యోగ ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని యువతీ, యువకులు యోగా చేస్తూ చక్కగా ఏలాంటి ఒత్తిడికి గురి కాకుండా చదువుకోవాలన్నారు.

**జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ**

ప్రధానమంత్రి పిలుపుమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి నెల రోజులపాటు జిల్లాలో ఒక ఉద్యమంలా యోగాంధ్ర కార్యక్రమాల్ని నిర్వహించామన్నారు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. యోగా ద్వారా ప్రపంచదృష్టిని ఆకర్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలను నిర్వహించారన్నారు.యోగా ద్వారా సమాజంలో సానుకూల,ఆరోగ్యకర దృక్పథం అలవడాలన్నారు. యువత సామాజిక రుగ్మతల నుండి బయటపడాలన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ మాస్టర్ క్రాంతి ఆధ్వర్యంలో స్టేడియంలో హాజరైన అందరితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ యోగాంధ్ర సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, యూనివర్సిటీ,కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మానసికంగా, శారీరకంగా నియంత్రణలో ఉండడం యోగాతోనే సాధ్యం





- టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

**తిరుపతి,జూన్ 21,మనం న్యూస్ః** మానవ సమాజంలో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా నియంత్రణలో ఉండడం యోగాతోనే సాధ్యమని టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి వెల్లడించారు. టిటిడి పరిపాలనా భవనం వెనుక ఉన్న పరేడ్ మైదానంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, విశ్వవ్యాప్తంగా 190 దేశాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మాట్లాడారు. నవీన సమాజంలో ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. యోగాతో ఆధ్యాత్మికత, మానసిక ఒత్తిళ్లు, శారీరకంగా తదితర అంశాలను నియంత్రణలో ఉండవచ్చని, తద్వారా ఉన్నతంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతర్గతంగా మనం సమాజంలో ఎలా ఉండాలో, జ్ఞాన వంతంగా, ఉన్నతంగా సమాజంలో ఉండేందుకు యోగా అంతర్గత పాఠాలు నేర్పుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగాను చేయడం దిన చర్యగా పాటించాలని ఆయన సూచించారు. యోగా దినోత్సవంలో టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు.విశాఖలో జరుగుతున్న యోగా దినోత్సవం గిన్నిస్ బుక్ రికార్డులో నమోదు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగా ప్రాధాన్యతమరింత పెంచేలా ప్రధానమంత్రి మాన్యశ్రీ నరేంద్ర మోదీ, సిఎం నారా చంద్రబాబు నాయుడు విశాఖలో యోగా దినోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.ముందుగా పరేడ్ మైదానంలో స్వామి వారికి దీపారాధన, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం యోగా నిపుణులు చేసిన ఆసనాలను క్రమ పద్ధతిలో టిటిడి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు చేశారు. యోగాసనాలు చేసేందుకు వీలుగా 4 ఎల్ ఈ డీ స్క్రీన్ లను , యోగా మ్యాట్ లను, త్రాగునీరు, కార్పెట్లు, అల్పాహారం, టీ షర్ట్ లను టిటిడి ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, జి. భాను ప్రకాష్ రెడ్డి, జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీ కృష్ణ, పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరమహంస యోగానంద విద్యాలయలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**శాంతిపురం, జూన్ 21 (మనం న్యూస్)ః** స్థానిక మండల పరిధిలోని శ్రీ శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు విద్యాలయ కౌన్సిల్ ఎన్నిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమం ప్రార్థనతో ప్రారంభం కాగా, యోగాస నాలతో ముగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ మరియు వైస్ ప్రిన్సిపల్ పార్థీవులు పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవం గొప్పతనాన్ని మరియు మన నిత్య జీవితంలో యోగాసనాలకు గల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేసి, యోగాను మన దయనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుని మంచి ఆరోగ్యాన్ని, మనోబలాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆ తర్వాత విద్యాలయ కౌన్సిల్ ఎన్నిక కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శాంతిపురం మండల విద్యాధికారి చంద్రశేఖర్ కౌన్సిల్లో ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జెస్ ఇచ్చి వారి యొక్క బాధ్యతలను వారికి తెలియ జేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ విద్యాలయ కౌన్సిల్లో సభ్యులుగా ఎన్నికైన విద్యార్థులకు వారి యొక్క బాధ్యతలను చక్కగా నిర్వహించాలని సూచించారు.

## దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపిన చిత్తూరు ఎంపి

అండర్ ప్యాసేజ్ నిర్మాణ పూర్తవడంతో హర్షం వ్యక్తం చేస్తున్న, వెపంజేరి, శెట్టి ఫోరం ప్రజలు

చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్లకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం



**చిత్తూరు,జూన్ 21,మనం న్యూస్:** గంగాధర నెల్లూరు నియోజకవర్గం, జీడీ నెల్లూరు మండలం, వేపంజేరి సమీప ప్రాంతమైన బంగారెడ్డి పల్లె గ్రామ పంచాయతీ, శెట్టి ఫోరం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యకు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చొరవతో పరిష్కారం లభించింది. దీంతో వేపంజేరి, శెట్టి ఫోరం గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ దగ్గుమళ్ళకు కృతజ్ఞతలు.., కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. జీడి నెల్లూరు మండలంలోని వెపంజేరి, బంగారెడ్డి పల్లె గ్రామ పంచాయతీ,శెట్టి ఫోరం గ్రామీణ ప్రాంతాల మధ్య హైవే రోడ్డును ఏర్పాటు చేయడంతో ఆ పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామ ప్రజలు తమ నిత్య కార్యకలాపాలను నిర్వహించుకోలేక ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో తాము పడుతున్న కష్టాలను చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావుకు మొరపెట్టుకున్నారు. జాతీయ రహదారి కింది భాగంలో అండర్ ప్యాసేజ్ నిర్మాణం ద్వారా దీర్ఘకాలిక సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలని విన్నవించారు. తక్షణమే స్పందించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., అండర్ ప్యాసేజ్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తిని మన్నించిన ఎన్డీఏ సర్కార్.., తక్షణమే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయించింది. గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి రాకపోకలకు అంతరాయం లేకుండా మార్గాన్ని సుగమం చేసింది. దీంతో వేపంజేరి, శెట్టి ఫోరం గ్రామీణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషిని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధిని కొనియాడుతున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు



**(చిత్తూరు జూన్21,మనం న్యూస్)ః** చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, ఆదేశాల మేరకు, చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ టి. సాయినాథ్ నేతృత్వంలో చిత్తూరు ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ మహేశ్వర డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ఓపెన్ డ్రింకింగ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిన్నటి రోజున జరిగిన తనిఖీల్లో 19 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన 7 మందికి రూ.70,000 జరిమానా, బహిరంగంగా మద్యం సేవించిన 12 మందికి రూ.12,000 జరిమానా విధించబడింది. మొత్తం రూ.82,000 జరిమానాలు విధించబడ్డాయి. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ మహేశ్వర మాట్లాడుతూరోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి. ఈ రకమైన చర్యలు తీవ్రంగా తీసుకుంటామని, ఎవ్వరైనా నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజలందరూ చట్టాలు పాటిస్తూ బాధ్యతతో ప్రవర్తించాలని సూచించారు.

## కుప్పం గ్రీన్ ఫీల్ ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు ఆవేదన



**శాంతిపురం, జూన్ 21 మనం న్యూస్ః** శనివారం ఎయిర్పోర్ట్ బాధిత రైతులు మండల కేంద్రంలోని బడుగుమాకులపల్లి వద్ద విలేకరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిపురం మండలం అమ్మవారిపేట, సొన్నె గాని పల్లి, కొలమడుగు, దండికుప్పం రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులందరూ చిన్న సన్నకారుల రైతులేనన్నారు.మా ప్రాంతంలో ఎయిర్పోర్ట్ వద్దు మా భూములు మాకు ముద్దు అని కుప్పం గ్రీన్ ఫీల్ ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు పేర్కొన్నారు. ఇక్కడ అందరికీ ఒక ఎకరా రెండు ఎకరాలు లేదా ఐదు ఎకరాలు భూములు మాత్రమే ఉన్నాయి. ఈ భూములను తరతరాలుగా వారసత్వంగా పొంది ఎంతో కష్టపడి అప్పులు చేసి భూములను వ్యవసాయానికి అనుగుణంగా మార్చుకున్నామన్నారు. ఈ ప్రాంతం మెట్ట భూమి కావడంతో అత్యధికంగా బోర్లు వేసి ఒకటో రెండో బోర్లలో వచ్చే నీటితో బంగారం లాంటి పంటలను పండిస్తున్నామన్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండించే సారవంతమైన భూములను ప్రభుత్వం ఏర్పాటు పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం చాలా దారుణం అన్నారు. 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా భూములను లాక్కొని రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2014లో 450 ఎకరాలను ఎయిర్ పోర్టు కొరకు భూసేకరణ చేసి ఇప్పటివరకు పునాది రాళ్లు కూడా వేయలేదన్నారు. ఇక్కడ ఏర్పోర్ట్ వస్తే స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఎలాంటి ఉపయోగముండదన్నారు. ప్రభుత్వం చెప్పే విధంగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి గాని ఇంకో రకంగా ఏమైనా ఎగుమతులు చేయడానికి ఈ ప్రాంతంలో అలాంటి పారిశ్రామికవేత్తలు ఎవరూ లేరన్నారు. అదే ఎయిర్పోర్టుకు బదులు పరిశ్రమలు తీసుకొని వస్తే నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించిన వారవుతారన్నారు. తాము అభివృద్ధికి ఎన్నడూ అడ్డు కాదని మా యొక్క రైతుల పరిస్థితిని కూడా చూడాలని మమ్మల్ని ఆదుకోవాలని కోరారు.

## యోగాను ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలి

- ప్రతి రోజు యోగా సాధన చేసి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకుందాం
- జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,జూన్ 21,మనం న్యూస్:** ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి దైనందన జీవితంలో యోగా సాధన నిరంతర ప్రక్రియగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిఎస్ఏ క్రీడా మైదానంలో యోగాంధ్ర ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పి మణికంఠ చందోలు, జేసి జి.విద్యాధరి, డిఎఫ్ఓ భరణి, నగరపాలక మేయర్ అముద, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, తదితర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజులు యోగాంధ్ర కార్యక్రమాలు రెవెన్యూ, టూరిజం, తదితర శాఖల సమన్వయంతో నిర్వహించడం జరిగందన్నారు. యోగాంధ్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా గౌ. భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడి, గౌ. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో యోగా సాధన కార్యక్రమంలో పాల్గొని యోగా వలన కలిగే లాభాలను ప్రజలకు సందేశం రూపంలో పంపారన్నారు. జిల్లాలో యోగాంధ్రలో భాగంగా 7 ప్రదేశాలలో భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించగా అందులో పులిగుండు, బోయకొండ, కాణిపాకం, కంగుంది వంటి నాలుగు పర్యాటక స్థలాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది పాల్గొన్నారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు 5 వేల మంది ట్రైనర్లను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల పైబడి ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాల్గొన్న వారికి సర్టిఫికేట్ లు అందించడం జరిగిందన్నారు. యోగా ను నెల రోజుల కార్యక్రమంగా కాకుండా నిరంతర జీవన విధానంగా భావించి సాధన చేయాలని, యోగా ద్వారా ప్రజల మానసిక, శారీరక ధృడత్వం మెరుగుపడుతుందన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస నిలిపి ప్రతి రోజు యోగా చేయండి.. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రముఖుల చేతుల మీదుగా మెగా ట్రైనర్స్ కి ఎం విశాల్, రెడ్డి మస్తాన్, రాధిక, సునీత ప్రేమ్ రాయి ప్రశంస పత్రాలు, మెమొంటో లు అందజేశారు యోగ గురువులైన శ్రీనివాస్ నాయుడు, బాబు నాయుడు లకు ప్రశంసా పత్రాలు, అందజేశారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, టూరిజం అధికారి గౌరీ, బిజెపి పార్టీ ప్రతినిధి జగదీష్, ఆర్డీవో శ్రీనివాసులు, అర్బన్ ఎమ్మార్వో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## 'మత్తు'కు బానిసలు కావద్దు

- డ్రగ్స్ కు దూరంగా ఉందాం: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం: డీఎస్పీ ప్రభాకర్




**రామచంద్రపురం,జూన్ 21(మనం న్యూస్):** మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు.. డ్రగ్స్ కు దూరంగా ఉందాం.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పలువురు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా పటాన్ చెరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ గుర్రం వినాయకరెడ్డి, పోలీసు అధికారులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డిఎస్పి ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతదని చెప్పారు. డ్రగ్స్ వాడిన, రవాణా చేసినా చట్ట రిత్యా నేరం అని తెలిపారు. డ్రగ్స్ సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే టీజీఎఎన్బీ టోల్ ఫ్రీ నెంబర్ అయిన 1908 కి లేదా 8712656777 కి లేదా 100 కి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ తమ వంతు సహకరించాలని కోరారు. అనంతరం పటాన్ చెరు సీఐ వినాయక రెడ్డి డ్రగ్స్ కు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ సీఐ నరేష్, బిడిఎల్ సీఐ స్వామి గౌడ్, జిన్నారం సీఐ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలు నాయక్, ఎస్ఐలు మహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పుకోవాల్సిందే

సబ్బండ వర్ణాల సమూహ స్వప్నం
హక్కుల పోరాటాల ప్రజాగ్రహం
పెత్తనాల పొగరు దించే ధర్మాగ్రహం
మనది మనకైన  తెలంగాణ

ప్రజాస్వామ్యంలో ప్రజలెప్పుడు
తప్పు చేయరు కాక చేయరు.
మారుతారు మారుస్తారు

ఎవరుకావాలో తేల్చుకుంటారు
ముగుతాడు వేసే పగ్గాలెప్పుడూ
జన సమూహపుచేతుల్లోనే..

ఇప్పటికైనా గతం గుర్తించాలి
వర్తమానాన్ని స్వాగతించాలి
అనుభవసారంతో  సాగాలి

మనిషి మనిషిని గుర్తించని
కులమైనా, మతమైనా, అధికారమైన
మనుషుల బతుకు ముంగిట
సాగిల పడి సలాం చేయాల్సిందే
పొర్లు దండాలు పెట్టాల్సిందే

సోయి లేని మాటలెందుకు
ఇది పురాణాల కాలము కానే కాదు
తోటోనికి సాయంచేయని పెత్తందార్లెందుకు
తిట్ల పురాణాల దండకాలెందుకు

అందలాల మాటల కూటమి కోటలు
బద్దలు చేసే ప్రజలే నిగ్గుతేల్చే వీరులు
న్యాయాన్యాయాల పుటం పెట్టే
కణ కణ లాడె నిప్పుకణికలు

**- పొట్లపల్లి శ్రీనివాసరావు**
9849254078

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# యుద్ధాలకు వ్యతిరేకంగా అమెరికన్లు



ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడంపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. గందరగోళ ప్రకటనలు చేస్తూ ప్రపంచ దేశాలను సైతం గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) నినాదంతో అధికారంలోకి వచ్చిన ఆయన..ఇజ్రాయెల్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తున్నా.. యుద్ధంలో పాల్గొంటారా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. 'నేనేం చేస్తానో నాకే తెలియదు' అన్నట్టు మాట్లాడుతుండడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై మరో రెండు వారాల్లో స్పష్టతనిస్తామని వైట్ హౌస్ ఒక ప్రకటన విడుదల చేసింది. అప్పటి వరకు చర్చలకు దారులు తెరిచే ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు యుద్ధంలో పాల్గొంటామనే సంకేతాలిచ్చేలా యూఎస్ఎస్ కార్ల్ విన్సల్, యూఎస్ఎస్ నిమిట్జ్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్లను మధ్యప్రాచ్యం, యూరప్‌లో అమెరికా మోహరించింది. ఇందులో గైడెడ్ మిసైల్ క్రూయిజర్లు, డిస్ట్రాయర్లు, 60 కంటే ఎక్కువ యుద్ధ, రీ ఫ్యూయలింగ్ విమానాలు, ఇతర సామాగ్రి విమానాలు ఉన్నాయి. మరోవైపు ఖతర్‌లోని అల్ అదీద్ ఎయిర్ బేస్ నుంచి తన విమానాల సంఖ్యను 40 నుంచి మూడుకు తగ్గించినట్టు సాటిలైట్ చిత్రాల ద్వారా స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలో గతంలో డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు, ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా భిన్నంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన కూడా గందరగోళంలోనే ఉన్నారని, ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నారని, డిసిషన్ తీసుకోవడానికి తన సన్నిహితులు, సపోర్టర్స్ నుంచి ఒపీనియన్స్ తీసుకుంటున్నారనే చర్చ జరుగుతున్నది. మరోవైపు యుద్ధంలో నేరుగా అమెరికా జోక్యాన్ని అధిక శాతం ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇది అమెరికా ప్రయోజనాలకు తీవ్ర విఘాతమని అభిప్రాయం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

**యుద్ధాల కోసం భారీగా ఖర్చు**

వివిధ దేశాల్లో యుద్ధాల కోసం దశాబ్దాలుగా అమెరికా భారీగా ఖర్చు చేసింది. 2003లో అమెరికా ఇర్వా దాడి చేసినప్పటి నుంచి, ఈ యుద్ధం ఖర్చు, పరిణామాలను అనేక అధ్యయనాలకు స్పష్టం చేశాయి. బ్రౌన్ యూనివర్సిటీ 2016 అధ్యయనం ప్రకారం, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, సిరియా వంటి దేశాల్లో యుద్ధాల కోసం అమెరికా 2001 నుంచి 2016 వరకు సుమారు 3.6 ట్రిలియన్ డాలర్లను ఖర్చు చేసింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ 2013 నివేదిక ప్రకారం, ఈ యుద్ధాల దీర్ఘకాలిక ఖర్చులు (వెటరన్స్ సంరక్షణ, రుణ వడ్డీ వంటివి) 4 నుంచి 6 ట్రిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా వేసింది. ఇరాక్‌లో యుద్ధం వల్ల లక్షలాది మంది ఇరాకీ పౌరులు, వేలాది మంది అమెరికా సైనికులు మరణించారు, మిడిల్ ఈస్ట్ లో రాజకీయ అస్థిరత్వం ఏర్పడి, అంతర్యుద్ధాలు పెరిగాయి. దీంతో గతంలో ట్రంప్ తన ట్వీట్లలో ఈ యుద్ధాలను 'నష్టం'గా అభివర్ణించారు.

**గతంలో యుద్ధాలను వ్యతిరేకించిన ట్రంప్**

మిడిల్ ఈస్ట్‌లో అమెరికా యుద్ధాలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'అమెరికా ఇరాక్‌లో రెండు ట్రిలియన్ డాలర్లు వెచ్చించి, అనేక యువ జీవితాలను కోల్పోయినా, ఇరాక్ నూనెను పొందలేకపోయింది' అని 2014 జూలై 4న ట్రంప్ ట్వీట్ చేశారు. ఇరాక్‌పై యుద్ధాన్ని 'మూర్ఖత్వంతో కూడిన చర్య'గా అభివర్ణించారు. దాని వల్ల అమెరికాకు ఎలాంటి లాభం లేకపోగా, భారీ ఆర్థిక నష్టం జరిగిందని చెప్పారు. 'మిడిల్ ఈస్ట్‌లో యుద్ధాల కోసం అమెరికా ఎనిమిది ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. వేలాది మంది సైనికులు మరణించారు, లక్షలాది ప్రజలు మరణించారు. మిడిల్ ఈస్ట్‌లో జోక్యం చేసుకోవడం అత్యంత దారుణమైన నిర్ణయం' అని 2019 అక్టోబర్ 7 నుంచి 13 మధ్యలో అనేక ట్వీట్లు చేశారు. 'మిడిల్ ఈస్ట్ క్వికాండ్లో అమెరికాను చిక్కుకునేలా చేసిన వారు, ఎనిమిది ట్రిలియన్ డాలర్లు, వేలాది జీవితాలను వృథా చేశారు. వారి సలహాలను పాటించవద్దు' అని పేర్కొన్నారు. మిడిల్ ఈస్ట్ యుద్ధాలు అమెరికాకు ఆర్థికంగా, రాజకీయంగా, మానవీయంగా భారీ నష్టాలను మిగిల్చాయని ఆయన చెప్పారు. అంతకు ముందు 2016లో ఒక ఎన్నికల సభలో మాట్లాడిన ఆయన 'ఇరాక్ యుద్ధంలో మనం 3 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేశాం, వేలాది జీవితాలు కోల్పోయాం, కానీ ఏమీ సాధించలేదు. గెలిచినవారికి లాభాలు దక్కాలి. నేను ఎప్పుడూ చెప్పేది ఏమిటంటే.. నూనె తీసుకోండి!' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ట్రంప్ యొక్క 'అమెరికా ఫస్ట్' విధానాన్ని, యుద్ధాల్లో ఆర్థిక లాభాలపై ఆయన దృష్టిని స్పష్టం చేస్తాయి.

**గతానికి విరుద్ధంగా ప్రస్తుత విధానాలు**

2025 జనవరిలో రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక.. మిడిల్ ఈస్ట్‌లో తీసుకున్న నిర్ణయాలు ఆయన గత వైఖరికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. 2025 మేలో ఆయన సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈలో పర్యటించి రెండు ట్రిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకున్నారని వైట్ హౌస్ ప్రకటించింది. అయితే ఇవి బైడెన్ పాలనలోనే ప్రారంభమైనవి కావడం, ట్రంప్ వీటిని తన ఘనతగా చెప్పుకోవడం విమర్శలకు దారితీసింది. మరోవైపు ఈ వ్యాపార ఒప్పందాలు ట్రంప్ కుటుంబానికి ఆర్థిక లాభాలను పెంచుతున్నదని వాషింగ్టన్ పోస్ట్ విమర్శించింది. ట్రంప్ మిడిల్ ఈస్ట్ విధానాలు, వ్యాపార ఒప్పందాలు, రాజకీయ నిర్ణయాలు, ఆయన వ్యక్తిగత లాభాల కోసం అమెరికా విదేశాంగ విధానాన్ని ఉపయోగిస్తున్నారనే ఆరోపణలకు దారితీశాయి. అంతేకాక, ట్రంప్ సిరియాపై ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడం, ఇజ్రాయెల్‌తో ఇరాన్‌పై దాడులకు ఆమోదం తెలపడం వంటి నిర్ణయాలు, ఆయన గతంలో 'మిడిల్ ఈస్ట్ లో జోక్యం దారుణం' అని చెప్పిన వాదనలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని కోరుకుంటున్నప్పటికీ, ఇజ్రాయెల్ దాడులకు ఆమోదం తెలపడం ద్వారా మిడిల్ ఈస్ట్ లో మరో యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికన్లు**

మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) నినాదానికి అమెరికాలో భారీ ఎత్తున మద్దతు లభించింది. ఎన్నికల్లో ట్రంప్ విజయానికి అదే కారణమైంది. అయితే ఇప్పుడు ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో అమెరికా ఎంట్రీపై అదే మద్దతుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన 'ఫర్ ఎవర్ వార్స్ నుంచి అమెరికా ను బయటకు తీసుకువస్తాను' అనే హామీని ఇప్పుడు వారు గుర్తు చేస్తున్నారు. జూన్ 13 నుంచి 16 మధ్యలో ఎకనామిస్ట్/యూగోవ్ నిర్వహించిన పోల్ ప్రకారం.. ట్రంప్‌నకు 2024 ఎన్నికల్లో ఓటు వేసిన 53% మంది ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణలో అమెరికా సైనిక జోక్యాన్ని వ్యతిరేకించారు. కేవలం 19 శాతం మంది మాత్రమే సమర్థించారు.

65 శాతం డెమొక్రాట్లు, 61 శాతం ఇండిపెండెంట్లు సైతం అమెరికా నేరుగా యుద్ధంలో దిగడాన్ని వ్యతిరేకించారు. అమెరికా జోక్యం వల్ల మధ్యప్రాచ్యంలో మరో దీర్ఘకాల యుద్ధంలో చిక్కుకుపోతామని మాగాకు సపోర్ట్ చేసిన ప్రముఖ వ్యక్తులైన మాజీ ఫాక్స్ న్యూస్ హోస్ట్ టకర్ కార్ల్ సన్, జార్జియా రిపబ్లికన్ ప్రతినిధి మార్జోరీ టేలర్ గ్రీన్ సైతం హెచ్చరించారు. ఇరాన్‌తో యుద్ధాన్ని అమెరికన్ సామ్రాజ్యాన్ని నాశనం చేసే చర్యగా కార్ల్ సన్ అభివర్ణించారు. చార్లీ కిర్క్ వంటి ట్రంప్ మిత్రపక్షాలు కూడా మాగా బేస్ యుద్ధంలో పాల్గొనడాన్ని ఇష్టపడటం లేదని, ఇది రిపబ్లికన్ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగించవచ్చని సూచించారు. 80 శాతం అమెరికన్లు ఇరాన్ అణు కార్యక్రమాన్ని నియంత్రించడానికి దౌత్యపరమైన చర్యలు లేదా ఆర్థిక ఆంక్షలను ఇష్టపడుతున్నారని, సైనిక చర్యనుకాదని చికాగో కౌన్సిల్ ఆన్ గ్లోబల్ అఫైర్స్ పోల్ స్పష్టం చేసింది. అయితే వివిధ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఆందోళన ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నది. అమెరికా నేరుగా జోక్యం చేసుకుంటే, ఇటు వైపు నుంచి రష్యా, చైనా ఎంట్రీ ఇస్తే మూడో ప్రపంచ యుద్ధం వైపు అడుగులు పడతాయేమోననే ఆందోళన సైతం వ్యక్తమవుతున్నది.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464



# పాఠశాల విద్యలో ప్రమాణాలు పెరగాలి





విద్యార్థి వికాసానికి పాఠశాల విద్య పునాది వంటిది. అందువలన ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు, నిరంతర పర్యవేక్షణ, మంచి వాతావరణం నెలకొంటేనే విద్యా కుసుమాలు వికసిస్తాయి. మనదేశంలో పాఠశాల విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే చాలా పెద్దది. 15 లక్షల పాఠశాలల్లో 25 కోట్ల పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నిధుల లేమి, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేక నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది. పాఠశాల విద్యపై పట్టింపు లేనితనంతో రాను రాను విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయని ఇటీవల కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పనితీరు గ్రేడింగ్ సూచికల నివేదిక తేటతెల్లం చేస్తున్నది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు కొంత మెరుగైనా ఆశించిన ఫలితాలు రాలేదు. విద్యార్థులు నమోదు అంతకంతకు తగ్గుతున్నది. మౌలిక వసతులు లేమితో విద్యా వ్యవస్థ కుంటుపడుతున్నది. జాతి భవిత తరగతి గదిలో రూపు దిద్దుకుంటుంది నాణ్యమైన విద్య అందరికీ అందినప్పుడే మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి తద్వారా దేశ ప్రగతికి బాటలు పడతాయి. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై అధికంగా నిధులు వెచ్చించాల్సిన అవసరం మరింత ఎక్కువగా ఉంది. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియమకం పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తే పనితీరు మెరుగు పడి విద్యా ప్రమాణాలు పెరుగుతాయి.

కేంద్ర విద్యాశాఖ ప్రతి ఏటా 28 రాష్ట్రాలు 8 కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో పాఠశాల విద్య స్థితిగతుల పైన పనితీరు గ్రేడింగ్ సూచికల (performance grading index&PGI) పేరుతో నివేదిక విడుదల చేస్తుంది. షాగున్, మధ్యాహ్న భోజన పథకం, యుడైసు, జాతీయ సాధన సర్వే, మరియు జాతీయ విద్య పరిశోధన సంస్థ (NCERT)గణాంకాల ఆధారంగా పీజీఐ గణాంకాలను విడుదల చేస్తుంది. అభ్యసన ఫలితాలు నాణ్యత, విద్యార్థులు, మౌలిక వసతులు, సమానత్వం మరియు పరిపాలన విధానం అనే ఆరు అంశాల ఆధారంగా పది దశలలో 73 సూచికల్లో 1000 పాయింట్ల ఆధారంగా అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల పరంగా పాఠశాల విద్య స్థితిగతులను విడుదల చేస్తుంది. ఇటీవల విడుదల చేసిన 2023-24 పనితీరు గ్రేడింగ్ నివేదికలో తెలంగాణ రాష్ట్రం అట్టడుగు నుండి రెండో దశలో ఉంది. పిజిఐ మొదటి లెవెల్ నుండి నాలుగవ లెవల్ వరకు ఏ ఒక్క రాష్ట్రం కూడా స్థానాన్ని పొందలేకపోయింది పనితీరు గ్రేడింగ్ 5వ దశలో (701-760 పాయింట్లు) చత్తీస్గడ్ రాష్ట్రం మాత్రమే స్థానం సంపాదించింది. ఆరోదశ అయిన ప్రచేస్తా-2లో ఏ రాష్ట్రం స్థానం సంపాదించలేకపోయింది. ఏడవ లెవెల్ దశ అయినా ప్రచేస్తా-3 లో పంజాబ్ ఢిల్లీ గుజరాత్ ఒరిస్సా కేరళ హర్యానా దాద్రా నగర్ హవేలీ గోవా మహారాష్ట్ర రాజస్థాన్ డామన్ డయ్యు (581-640) మొదలైన రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు స్థానాన్ని పొందాయి. ఎనిమిదో దశ అయిన ఆకాంక్ష-1 లో ఆంధ్రప్రదేశ్ స్థానం పొందగా తొమ్మిదో దశ అయిన ఆకాంక్ష-2 13 రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రం స్థానంను పొందింది. జిల్లాల పరంగా ఫలితాలు విశ్లేషిస్తే తెలంగాణలో మేడ్చల్ మల్కాజ్ గిరి, సిద్దిపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో పనితీరు గ్రేడింగ్ సూచికలో మంచి మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ములుగు, మహబూబాబాద్, ఆసిఫాబాద్, అదిలాబాద్ అధ్వాన ఫలితాలతో అట్టడుగు స్థానంలో నిలిచాయి.

14 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఉచిత విద్య, పౌష్టికాహారం, ఉచిత దుస్తులు, పుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను కాదని ఏం సదుపాయాలు లేని అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రవేశాలు పెరగడానికి గల కారణాలు ఏమిటి అన్న విషయమై అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది. ఇటీవల విడుదల చేసిన ఆసర్ సర్వే ఫలితాలు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించడం లేదని తేల్చినది. తరగతిల వారి అభ్యసన ఫలితాలు విశ్లేషిస్తే అధోఃపాతాళంలో ఉన్నాం. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందుతున్న విద్యార్థుల నిలుపుదల రేటు క్రమేపి తగ్గుతున్నది. బడి బయట పిల్లలు, బాల కార్మికులు బడికి వెళ్లేందుకు ఆపరేషన్ ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆశించిన రీతిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదు. మరుగుదొడ్లు మూత్రశాలలు, ప్రహరీ గోడలు, క్రీడ మైదానాలు, ప్రయోగశాల, గ్రంథాలయం, త్రాగునీటి సరఫరా మెజార్టీ పాఠశాలల్లో లేవు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు కోసం ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపోవడం లేదు. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మన బడి పథకం కింద మూడు దశలలో రు. 7290 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరచాలని లక్ష్యంలో భాగంగా మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇంకా చాలా చోట్ల నిధులు ఖర్చు జరగలేదు.పనులు పూర్తి కాలేదు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతుల విషయంలో కొంత మెరుగైన ఇంకా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. రాష్ట్రంలో 6 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏకీకృత సర్వీస్ రూల్స్ లేక మెజార్టీ మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులుగా ఇన్చార్జీలు కొనసాగుతున్నారు.

అనేక రంగాల అభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉంది పరిశ్రమలు, ఆర్థికం, సాంకేతిక పరిజ్ఞానం ,వ్యవసాయం వంటివి ప్రత్యక్షంగా పరోక్షంగా విద్యతో అనుసంధానమై ఉన్నాయి. కావున పాఠశాల దశ నుంచి సరైన ప్రణాళిక ఉండాలి. సమర్థ కార్యాచరణ కావాలి. ఉపాధ్యాయులు ఏకోన్ముఖ లక్ష్యంతో పని చేస్తే ప్రాథమిక విద్య మెరుగుపడుతుంది. బోధనలో వస్తున్న విప్లవాత్మ మార్పులకు అనుగుణంగా తగిన వృత్యంతర శిక్షణ ఇవ్వాలి. ప్రాథమిక తరగతులకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలి. ఉన్నత తరగతులకు సబ్జెక్టుకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయుల నియమిస్తే విద్యా ప్రమాణాలు వికసిస్తాయి. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. దేశ భవిష్యత్తు నిర్దేశించే పాఠశాల విద్యా వ్యవస్థలో ఎటువంటి లోపాలున్న వాటి ఫలితాలు సమాజాన్ని నిర్వీర్యం చేస్తాయి. కనుక ప్రాథమిక స్థాయి నుంచి విద్యకు తగిన చికిత్స అందిస్తే భారతదేశ భవిష్యత్తు తరగతి గోడల మధ్య నిలబడుతుంది.

**- అంకం నరేష్**
6301650324

# సైప్రస్‌తో ద్రుఢ బంధం

సైప్రస్ మధ్యధార సముద్రంలో ఆసియా, ఐరోపా, ఆఫ్రికాలు కలిసే ప్రదేశంలో ఉంది. 1960లో స్వేచ్ఛా వాయువులు పొందింది. రాజధాని నికోషియా. సైప్రస్ కరెన్సీ సైప్రస్ పౌండ్. మాట్లాడే భాషలు గ్రీక్, ఇంగ్లీష్. మతం ఇస్లాం, క్రైస్తవం. భారత్‌లో మాదిరే ఇది ప్రధానంగా వ్యవసాయిక దేశం. రాబడి అంతా వ్యవసాయం పైనే మిక్కుటం. ప్రధాని మోదీ కెనడా వెళుతు




సైప్రస్‌లో దిగారు. సైప్రస్ లో మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆ దేశ అధ్యక్షుడు చిరునవ్వుతో మోదీతో కరచాలనం చేశారు. అనంతరం అధ్యక్ష భవనంలో సైప్రస్ లో అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారి యోస్ 3' తో సత్కరించారు. దీని అర్థం ఏమనగా సైప్రస్ ప్రథమ అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ మకారియోస్ 3 పేరు మీద అందించే పురస్కారం. సైప్రస్‌లో ఇటువంటి పురస్కారం విశిష్టమైన, ముఖ్యమైన హోదా కలిగిన వ్యక్తులకు ప్రధానం చేస్తారు. ఈ అవార్డు అందుకున్న మోదీ ఇది 143 కోట్ల మంది భారతీయులకు అంకితం అని ఉద్ఘాటించారు. ఈ అవార్డుతో మోదీకి వచ్చిన అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య ఇరవై మూడు కు చేరింది. దీనికి ప్రతిగా అందమైన కశ్మీర్ సిల్క్ తివాచి, ఆంధ్రప్రదేశ్‌లో చేసిన వెండి పర్సును సైప్రస్ అధ్యక్షుడికి అందించారు. వాటిని అందుకున్న సైప్రస్ అధ్యక్షుడు భారత్ కళలకు నిలయం అని చెప్పడం గమనార్హం. ఇరువురు నేతలు అక్కడ నుంచి ఒక చారిత్రక కేంద్రంకు చేరుకున్నారు. అక్కడ స్థానిక చట్ట సభ్యురాలు మైఖల్ క్రై ద్రియోటి భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం మోదీకి పాదాభి వందనం చేశారు. దానికి మోదీ పొంగి పోయారు. భారత్ పట్ల వారికి ఉన్న గౌరవం కొనియాడారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మోదీ సైప్రస్ వెళ్లడం జరిగింది. వారి చర్చలలో ముఖ్యంగా వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పర్యావరణం, ఆరోగ్యం, మరియు ప్రాంతీయ అంశాలపై చర్చ సాగింది.భారత్ లో ఏప్రిల్ 22 జమ్మూ లోని పహల్గం దాడిని సైప్రస్ అధ్యక్షుడు ఖండించారు. భారత్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భారత్‌తో కలసి ఉగ్రమూకలను అణచి వేస్తాం అని చెప్పడం విశేషం. అలాగే పశ్చిమ ఆసియాలో సాగుతున్న యుద్ధం, తీవ్ర ఉద్రిక్తతలు దేశాలను అస్థిర పరుస్తాయి అని, ప్రగతి కుంటుపడుతుంది, పౌరులకు రక్షణ ఉండదు అని ముఖా ముఖిగా చర్చించుకున్నారు. ఇది యుద్దాల శకం కాదు, శాంతి యుగం అని మోదీ అభిప్రాయపడ్డారు. రష్యా, ఉక్రైన్ యుద్ధం, గాజలో ఉద్రిక్తత, ఇప్పుడు ఇరాన్ మరియు ఇజ్రాయెల్ లో దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతల మవుతుంది. ఏం జరుగుతుందో, ఎవరిది తప్పో, పై చేయో అర్థం కాకుండ ఉంది. భారత్ లో ఇటీవల అహ్మదా బాద్ సంభవించిన విమాన ప్రమాదం తనను కలచి వేసిందని సైప్రస్ అధ్యక్షుడు వాపోయారు. విశ్వంలో దాడులు, కాల్పులు ఆగి శాంతికి కృషి చేయాలని ఇరువురు నేతలు అభిప్రాయ పడ్డారు. చర్చలే పరిష్కార మార్గాలు అని ఊటంకించారు. ఈ దిశలో శాంతికి మేము ఎప్పుడు ముందు ఉంటామని మోదీ చెప్పారు. భారత్ తో కలసి పని చేయడం మాకు వరం అని సైప్రస్ చెప్పడం, ఒక చిన్న దేశం శాంతికి కృషి చేయడం అభినందనీయం అని మోదీ ప్రశంసించారు. మోదీ సైప్రస్ నుంచి జి -7 సమావేశాల కోసం కెనడా వెళ్ళి అక్కడ నుంచి క్రొయేషియా చేరుకుంటారు. సైప్రస్ నుంచి వెళుతు మోదీ భారత్, సైప్రస్ ల మధ్య సహకారం కొనసాగుతుందని, రెండు దేశాల మధ్య గట్టి బంధం బలపడుతుందని చెప్పారు. 2026లో సైప్రస్ ఈయూ అధ్యక్ష పదవి చేపట్టుతున్న తరుణం లో మోదీ, నికొస్ క్రిస్టోడౌలిడెస్ కు శుభాకాంక్షలు చెప్పారు.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# యోగా ఆరోగ్యమేనా?



ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయవచ్చని ప్రచారం జరుగుతుంది. నేటి బిజీ జీవితాలలో మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. దీంతో ప్రజలు రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు. వీటి నుంచి విముక్తి పొందడానికి శాస్త్రీయ వైద్య విధానాలున్నాయి. మరొవైపు యోగాను ప్రత్యామ్నాయ సాంప్రదాయ వైద్యంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ యోగాను ఆయుష్ విభాగంలో చేర్చారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక వికాసం పొందవచ్చునని యోగ సాధకులంటున్నారు. దీంతో యోగాకు ఇటీవల విస్తృత ప్రాధాన్యం పెరిగింది. భారత్ చొరవతో అంతర్జాతీయ యోగ దినోత్సవంను కూడా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుటకై 2014లో ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ఇప్పటికి పది సంవత్సరాల యోగ డే ప్రయాణం పూర్తయిన సందర్భంగా 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా' అనే నినాదంతో ఈ యేడు నిర్వహించుకొంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం భారతదేశంలో ప్రభుత్వ సంస్థల్లో అధికారికంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది యోగా డే రోజు ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మానవ జీవనశైలిలో యోగ ఏ మేరకు ప్రభావం చూపుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కొందరు, యోగ కూడా వ్యాయామం లాంటిదనీ మరికొందరు, యోగాతో ముక్తిని పొందవచ్చని ఇంకొందరు ఎవరికి తోచినట్లు వారు ప్రచారం చేస్తున్నారు. నిజానికి యోగాను ప్రతిపాదించిన పతంజలి దాన్ని మోక్షానికి మార్గం గానే చెప్పాడు తప్ప, ఆరోగ్యాన్ని దానితో ముడి పెట్టలేదు. ఆలోచనలను స్తంభింప చేయడమే యోగ అని పతంజలి భావన. దీనిలో సమాధి, సాధన, విభూతి, కైవల్యం అనే నాలుగు ప్రక్రియలు ఉంటాయి. యోగాకు ఇటీవల ప్రజాదరణ లభించడంతో ఇది వ్యాపార వస్తువుగా, సామాన్యులకందని విద్యగా మారిపోయింది. జనాలను ఆకర్షించడం కోసం ఆరోగ్యాన్ని, వ్యాయామాన్ని, భక్తిని కలగలిపి పలు పేర్లతో యోగాను ప్రజల ముందుకు తెచ్చి, కొందరు గురువులుగా చలామణి అవుతున్నారు. పట్టణాలలో యోగ, ధ్యాన కేంద్రాలు విపరీతంగా వెలిశాయి. మరోవైపు జిమ్, ఏరోబిక్ వంటి ఫిట్నెస్ కేంద్రాలకు కూడా డిమాండ్ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో యోగాను ఒక ఆరోగ్య సైన్స్‌గా ప్రచారం చేస్తున్నారు. మరి ధనికులు, విద్యావంతులే చేసే ఈ యోగా, ధ్యానంలో శ్రమ జీవుల పాత్ర ఎంత? వారి ఆరోగ్యం కోసం దేన్ని అనుసరించాలనేది ప్రశ్న.

ఇటీవల యోగాకు రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక రంగులను రుద్దుతూ విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. రోజు రోజుకు యోగా సాధనం చేసే వారి కన్నా ప్రచారకులే ఎక్కువయ్యారు. జిమ్‌ల్లో చేసే వ్యాయామం, రన్నింగ్, వాకింగ్, ఆటల కన్నా యోగాను అద్భుత వ్యాయామంగా పోలుస్తున్నారు. యోగాలో ఒక ప్రక్రియగా గుర్తింపు పొందిన ప్రాణాయామంలో ఊపిరిని చాలా సేపు బిగియ పట్టడం వల్ల కార్బన్ డైయాక్సైడ్ ఎక్కువసేపు శరీరంలో ఉండిపోయి, సరిపడా ఆక్సిజన్ మెదడుకు అందక కొంచెం మత్తుగాను, నిస్సత్తుగాను అనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం మనం పేల్చే గాలిలోని ఆక్సిజన్‌లో 20 శాతంపైగా మెదడు ఉపయోగించు కుంటుంది. ఊపిరి బిగపట్టడం వల్ల మెదడుకు కావలసినంత ఆక్సిజన్ అందక మరో లోకంలో తేలిపోతున్న భావన కలుగుతుంది. దానివల్ల చిత్తభ్రాంతులు కలుగుతాయి. దాన్నే ఆత్మజ్ఞాన సాధన, మోక్షానికి చేరుకోవడంగా భావిస్తారు. మరి ఇప్పుడు యోగా ఆధ్యాత్మిక మార్గంగా భావిం చాలా? ఆరోగ్య మార్గమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. శ్వాస మీద ధ్యాసతో తరచు ప్రాణాయామం చేయడం వల్ల మెదడుకు హాని జరిగే ప్రమాదం కూడా ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇక్కడ యోగాను తప్పు పట్టడం లేదు, కానీ ప్రజల్లో దీనికి సంబంధం లేని అనేక ఆరోగ్య లాభాలను ప్రచారం చేస్తూ తప్పు దోవ పట్టిస్తున్నారు. ఇప్పటి వరకు ఏ పరిశోధన కూడా యోగాతో మానవునికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పలేదు. ఈ క్రమంలో ఆధునిక వైద్య శాస్త్రానికి అంతుచిక్కని వ్యాధులు సైతం యోగా ద్వారా తగ్గుతాయని యోగ గురువులు ప్రచారం చేయడం సరికాదు. మన సాంప్రదాయ వైద్య విధానాలైన ఆయుర్వేదం, యోగ మరియు న్యాచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి వాటిపై ఇంకా అధ్యయనాలు జరగాలి. యోగా, ధ్యానం మన ఒత్తిడి, ఆందోళనకు కొంత ఉపశమన సాధనంగానే చూడాలి తప్ప, చికిత్స సాధనంగా చూడవద్దు. మానవ జీవనశైలిలో నడకే ఆరోగ్యాన్ని మంచిదని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ప్రతిరోజు ఉదయం చేసే చిన్నపాటి వ్యాయామాలే మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రజలు గుర్తించాలి. వీటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి. ఇదే నిజమైన ఆరోగ్య సైన్స్.

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428



# ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ కోసం యోగాంధ్ర

## రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 12.76 లక్షల మంది యోగాంధ్రలో రిజిస్ట్రేషన్

## జిల్లాలో విజయవంతంగా యోగాంధ్ర కార్యక్రమం

## ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, జూన్ 21:మనం న్యూస్:** ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు,యోగభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా మరియు సంపన్నంగా ఉండాలన్నది ముఖ్యమంత్రి గారి ఉద్దేశం అన్నారు..అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ముందుగా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిందన్నారు.. అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా మన రాష్ట్రం ఒక రికార్డును సృష్టించిందన్నారు...రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల 39 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులో అత్యధికంగా కర్నూలు జిల్లా నుండి 12 లక్షల 76 వేల మందిని రిజిస్ట్రేషన్ చేయగలిగామన్నారు..నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగస్తులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు..

దాదాపుగా 5 వేల 287 వెన్యూ లలో శిక్షణ కార్యక్రమాలను ఇచ్చామన్నారు.. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో యోగా కు సంబంధించిన పోటీలు నిర్వహించామని, జిల్లా నుండి రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలలో పాల్గొన్నారని, పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.. థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా జూన్ 17 వ తేదీ కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో 5 వేల మందితో ఇదే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు... అదే విధంగా 3 పర్యాటక ప్రదేశాలలో కూడా 2 వేల 300 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందన్నారు.. గ్రామ సచివాలయ సిబ్బంది నుండి జాయింట్ కలెక్టర్ వరకు అందరూ నెల రోజుల పాటు కృషి చేశారని, కలెక్టర్ ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలిపారు. అలాగే యోగా మాస్టర్లు కూడా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేశారని కలెక్టర్ అభినందించారు.. యోగాను ఆపకుండా, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు..యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క పౌరుడు సర్టిఫికెట్ ను తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు...

కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులు,మహిళలు, అధికారులు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు..

అనంతరం 3 వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో కలెక్టర్ అందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు అందచేశారు..

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,విద్యాసంస్థల అధినేత కె.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాన్న నిస్వార్థపు వ్యక్తి



**కర్నూలు జూన్ 21 మనం న్యూస్:** పిల్లల భవిష్యత్తు కోసం తపన పడే నిస్వార్థపు వ్యక్తి నాన్న అని క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్ భాష గుర్తు చేశారు. అంతర్జాతీయ నాన్నల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆల్తాఫ్ అధ్యక్షతన నాన్నలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వర్ భాష మాట్లాడుతూ తన బిడ్డల ఎదుగుదలను మురిసిపోతాడు. పిల్లలు ఏదైనా సాధిస్తే చిన్న పిల్లాడిలా సంబరపడే నాన్న కోసం ఏడాదిలో ఒక్కసారైనా గౌరవించడం మన బాధ్యతగా భావించాలన్నారు. అంతరం పిల్లలు, నాన్నలు ఇద్దరికి ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి క్లస్టర్ ప్రిన్సిపల్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరి, రాధ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన మున్సిపల్



**బేతంచేర్ల, జూన్21(మనం న్యూస్):** నగర పంచాయతీ పరిధిలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సదరు పాఠశాల యందు గల వంటశాలను తనిఖీ చేసి విద్యార్థులకు సరిపడినట్లు వంటలు వండుతున్నారా అందుకు నాణ్యమైన సరుకులు ఉపయోగిస్తున్నారా లేదా అని తనిఖీ చేసి సదరు సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వడం అయినది మరియు ప్రతిరోజు మెనూ ప్రకారము వొండి విద్యార్థులకు కావలసినంత వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక అధికారి మెహరున్నిసా బేగం ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ మధు కుమార్ ఏఎన్ఎం రేణుక పాల్గొన్నారు

# ప్రజలే నా దేవుళ్ళు.. గ్రామమే నా దేవాలయం



- **తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్**

**కౌతాళం,జూన్ 21 మనం న్యూస్:** మండలంలోని వల్లూరు గ్రామంలో బీసీ కాలనీలో రోడ్డు వైపు ప్రజలు ఇబ్బంది పడకూడదు ఉద్దేశంతో జెసిబి ద్వారా బాగు చేయడం జరిగిందని తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలే నా దేవుళ్ళు, గ్రామమే నా దేవాలయము అని అన్నారు. గ్రామంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుండి ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. గ్రామంలో ప్రజలు బాగుంటేనే ముఖ్యంగా నేను బాగున్నట్టు అని అన్నారు. గ్రామ ప్రజలు నా కుటుంబ సభ్యులతో సమానమని అన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తానని అన్నారు. ముఖ్యంగా గ్రామ అభివృద్ధి నా ధ్యేయం అని అన్నారు. అదే విధంగా మా కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రజానీకం కోసం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాత్రింబవళ్లు రాష్ట్ర ప్రజల కోసం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. చంద్రబాబు నాయుడు కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు అని అన్నారు. అనంతరం అడివప్ప గౌడ్ దగ్గరుండి పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

# ముళ్ళ కంపలను తొలగించాలి



**దేవనకొండ, జూన్ 21( మనం న్యూస్ ప్రతినిధి):** పత్తికొండ నియోజకవర్గం కొత్తపల్లి గ్రామంలో రిజర్వాయర్కు ముళ్ళ కంపలు,కంప చెట్లు అడ్డంగా ఉండడంతో వాటిని తొలగించాలని టిడిపి నాయకులు పేర్కొన్నారు. 15 రోజుల క్రితం పత్తికొండ ఎమ్మెల్యే గౌరవనీయులు శ్యాంబాబు గారిని దేవనకొండ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కలిసి కొత్తపల్లి రిజర్వాయర్ కుడి కాలవలో ముళ్ళ కంపలు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయని కాలువలో ఉన్నటువంటి కంప చెట్లను తొలగించాలని కోరారు. అందుకు ఆయన స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించడం జరిగింది. అందుకు స్పందించిన అధికారులు వెంటనే ప్రతిపాదన సిద్ధం చేసి ముళ్ల పొదలను తొలగించేందుకు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈరోజు పనులు ప్రారంభించడం జరిగింది. అందుకు ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ గారికి దేవనకొండ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే దేవనకొండ మండలంలోని పిల్ల కాలువలు పూర్తిచేసి 46వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో 200 కోట్లతో ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ గుణాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, సర్పంచ్ నాగరాజుగౌడ్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ డి ఈ రామాంజనేయులు, ఎఈ, జేఈ నేతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

### కౌతాళం 12వ వార్డులో ప్రతి ఇంటికి నీరు చేరేవరకు

# బాల్ వాలు వేయించిన సర్పంచ్ పాల్ దినకర్

**కౌతాళం జూన్ 21 మనం న్యూస్:** మండల కేంద్రమైన కౌతాళంలో 12వ వార్డు పింజారి విధి నందు నీటి సమస్య పై శుక్రవారం రోజున రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు కొళాయి పైపులకు బాల్ వాల్ వేయించి ప్రతి ఇంటికి నీరు చేరే వరకు గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ మరియు పంచాయతీ కార్యదర్శి జి.ప్రకాశం వారు పరివేక్షించడం జరిగింది. అలాగే మొన్నటి రోజున సదరు న్యూస్ లో వచ్చిన వార్త గురించి సర్పంచ్ మాట్లాడుతూ అక్కడ కొందరు కాలనీ వాసులు పంచాయతీ అనుమతి లేకుండా కొళాయి కనెక్షన్ తీసుకుంటున్నారని సమాచారం అందుకున్న మేము అక్కడ వెళ్లి వారికి నచ్చచెప్పి పంచాయతీ ద్వారా నీటిని అందిస్తామని మాట్లాడడం జరిగింది. అంతేగాని ఎటువంటి వాగ్వాదం జరగలేదు.కాకపోతే రెండు నెలలుగా నీరు రావటం లేదని కొందరు కావాలనే పత్రికలకు తప్పుడు ఇవ్వటం జరిగింది.దీనిని పత్రిక వారు గమనించగలరు. పత్రికలు, విలేకరులపై మాకు గౌరవం ఉంది. పత్రిక మిత్రులు కూడా వాస్తవాలు తెలుసుకొని ప్రచారం చేయగలరని సర్పంచ్ పాల్ దినకర్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.



## ఉప్పర్ల పల్లె పాఠశాలలో వీడ్కోలు సభ



- **హెచ్ఎంని సన్మానిస్తున్న టీడీపీ నేతలు**

**తుగ్గలి జూన్ 21(మనం న్యూస్):** మండల పరిధిలోని ఉప్పర్ల పల్లె గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో హెచ్ఎం గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ను బదిలీలలో భాగంగా పాఠశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా అయన ను టీడీపీ నాయకులు అప్పా వేణుగోపాల్ రాయల్, శ్రీనివాసులు గౌడ్,విద్య కమిటీ చైర్మన్ టైలర్ కందుగిరి,రాము నాయక్ లు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు,వారు మాట్లాడుతూ బదిలీ ఉద్యోగంలో భాగమని,ఎక్కడ పనిచేసిన సేవా భావంతో విద్యను బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రు, విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యోగా మనోశాంతికి దివ్య ఔషధం

- **యోగాసనాలు చేస్తున్నఎమ్మెల్యే**



**పత్తికొండ జూన్ 21(మనం న్యూస్ ):** మానసిక ప్రశాంతతకు,శారీరక ఉల్లాసానికి,మంచి ఆరోగ్యానికి యోగా.. దివ్య ఔషధంగా పనిచేస్తుందని పత్తికొండ శాసనసభ్యులు కే.ఇ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు.11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పత్తికొండలోని తేరు బజారులో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమానికి ఎమ్మెల్యే కే.ఇ శ్యామ్ కుమార్ పాల్గొని యోగాసనాలు చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంప్రదాయం యొక్క అమూల్యమైన బహుమతి అయిన యోగా, శారీరక, మానసిక శ్రేయస్సును పెంపొందించడానికి అత్యంత విశ్వసనీయ మార్గాలలో ఒకటని,ఇది మనస్సు, శరీరం యొక్క ఐక్యతను సూచిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్, ఎంపీడీవో కవిత,ఎమ్మార్వో హుస్సేన్ సాహెబ్, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు,సీఐ జయన్న, అధికారులు,విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేదే యోగ



- **స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ**

**మంత్రాలయం , జూన్ 21, మనం న్యూస్ :-** మనసును ఉత్తేజాన్నిచ్చి, శరీరాన్ని చైతన్యపరిచి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేదే యోగ అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానవాళికి యోగ చాలా అవసరం అన్నారు.ఆరోగ్యానికి మించిన సంపద లేదని అన్నారు. అనంతరం యోగ ఇన్స్పెక్టర్ శ్రీకృష్ణ పరబ్రహ్మ అధ్వర్యంలో యోగ ఆసనాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్ , తాసిల్దార్ రమాదేవి ,సిఐ రామానుజులు , జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బి లక్ష్మన్న , వైద్యాధికారిని గోవిందమ్మ , ప్రధానోపాధ్యాయులు అంపయ్య, ఉపాధ్యాయులు నరసింహులు , విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే మండల పరిధిలోని మాధవరం , మాలపల్లి , చెట్నేహాళ్ళి , ఖగ్గల్ , రాంపురం , రచ్చుమర్రి , బూదురు ,వగరూర్ కలదేవకుంట చిలకలదోన తదితర గ్రామాలలో పాఠశాల, సచివాలయం లో యోగ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులు , పంచాయతీ సెక్రటరీ, వివిధ శాఖల అధికారులు తెల్లవారుజాము నుంచే యోగా ఆసనాలను చేశారు. యోగాంధ్ర వేడుకలు విజయవంతం కావడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం..

# యోగానే మార్గం...



- **మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి**

**తుగ్గలి, జూన్ 21(మనం న్యూస్ ):** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై,స్వయంగా యోగాసనాలు వేసి అందరిలో స్ఫూర్తి నింపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి దైనందిన జీవిత ప్రయాణంలో ప్రతి ఒక్కరూ యోగ సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.శరీరానికి శక్తి,మనసుకు శాంతి,ఆత్మకు ఆనందం యోగ ద్వారానే సాధ్యమన్నారు. యోగ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవి ప్రసాద్,ఎంపీడీవో విశ్వమోహన్,డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి,ఏవో బాషా, డాక్టర్ అమర్నాథ్,మీనాజ్ పాషా.ఎంఈవో రామ వెంకటేశ్వర్లు,హెచ్ఎం ఆగస్టీన్, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్,టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్,విద్యార్థులు పాల్గొన్నారు.

# గూటు పల్లె పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి. సుబ్బరాయుడు**

**బేతంచేర్ల, జూన్ 21(మనంన్యూస్):** మండలపరిదిలో గూటు పల్లె గ్రామములో పొగాకు రైతులతో సమావేశంను ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి పి. రామ మోహన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశనికి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు హాజరై పొగాకు రైతులతో ముఖాముఖిగా మాట్లాడటం జరిగింది పొగాకు సాగు చేసిన రైతులు మాట్లాడుతూ గూటు పల్లె గ్రామంలోనే సుమారు 500 ఎకరాలలో చుక్క బర్లీ సూరిపొగాకు సాగు చేశారు జిపిఐ అలియన్స్ కంపెనీ వారి అగ్రిమెంట్ తో సాగు చేయడం జరిగింది కొంత పొగాకు క్వింటం 14 వేలు రూపాయలు కొనుగోలు చేసి 400 బేళ్లు కొనలేదు రైతులు కంపెనీల చుట్టు తిరుగుతున్నా ఉలుకు పలుకు లేదు రైతులు తెలిపిన విషయాలపై విన్న రైతు సంఘం నాయకులు ఈ సమస్యపై ఈ నెల 24 వతేదీన నంద్యాల కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే నిరసన కార్యక్రమంలో బేతంచెర్ల మండలం లోని పొగాకు సాగు రైతులందరూ కలిసి ప్రభుత్వం పొగాకు రైతులకు న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమం లో కె. మురళి, సి నరసింహులు ఎస్. శ్రీరాములు కె నాగేశ్వర రావ్ కోడెల రాముడు




చాంద్ బాష ఎ లింగ మూర్తి ఎ శ్రీరాములు కెఎన్ రాజు ఎస్ శేషయ్య బి కృష్ణా చారి వెంకట స్వామి నన్నూరు రాజు వి.మురళి మోహన్ మహేష్ తదితర రైతులు పాల్గొన్నారు

# మల్లెపూలు పెట్టుకునే మహిళలను కించపర్చడం పెద్ద కుట్ర..

- హిందూ ధర్మంపై దాడిని తిప్పికొట్టండి...
- యోగా ప్రపంచానికి మోదీ అందించిన మహా 'యోగం'..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్...






**కరీంనగర్, జూన్ 21(మనం బ్యూరో) :** మల్లెపూలు పెట్టుకునే మహిళలను కించపరుస్తూ ఆంధ్రాలో కొందరు చేస్తున్న వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇట్లాంటి వ్యాఖ్యలతో హిందూ మహిళల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి అన్యమతంలోకి మార్చుకోవాలనే కుట్ర జరుగుతోందన్నారు. ఇది ముమ్మాటికీ హిందూ ధర్మంపై జరిగిన దాడిగా భావించి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం మధ్యాహ్నం మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణనగర్ కాలనీలో రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన యోగా వేడుకలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ అన్ని టెన్షన్లు దూరం చేసిన మానసిక ప్రశాంతత కలిగించే శక్తి యోగా, ధ్యాన ప్రక్రియలకు ఉందని అన్నారు. రామచంద్ర మిషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. హిందూ ధర్మ రక్షణ కోసం రామచంద్ర మిషన్ చేస్తున్న సేవలు ఎనలేనివని అభిప్రాయపడ్డారు.

ఉదయం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు ప్రధానమంత్రి మోదీయేనని కొనియాడారు. "ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన 2014లో ఇదే రోజున(జూన్ 21) ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికగా 'యోగా' గొప్పతనాన్ని, యోగావల్ల జరిగే మేలును వివరిస్తూ 'అంతర్జాతీయ యోగా డే' నిర్వహించాలని ప్రతిపాదించిన నాయకుడు మోదీ అన్నారు. ఆయన కృషివల్లే ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' జరుపుకోవాలని ప్రకటించిందన్నారు. ప్రపంచలోని 200 దేశాలకుపైగా ప్రజలు యోగా దినోత్సవాలు జరుపుకుంటున్నారంటే మోదీ చేసిన కృషి, మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలపట్ల ఉన్న నిబద్ధతే కారణం"అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశాల మధ్య చూసినా ఉద్రిక్త పరిస్థితులే కన్పిస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధాలతోపాటు పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాద చర్యలతో ప్రపంచమంతా ఆందోళన చెందుతోందన్నారు. దేశాల మధ్య, మనుషుల మధ్య వైరం తగ్గించడానికి 'యోగా' ఎంతో మేలు చేస్తుందన్నారు. టెన్షన్లను దూరం చేసి మానసిక, ఆధ్యాత్మిక ప్రశాంతత కలిగించే సాధనమే యోగా. యోగ అంటే సాధన చేయడం.. అంతిమంగా మానవత్వాన్ని సాధించడమే యోగా లక్ష్యం అన్నారు. ప్రపంచమంతా మానవత్వం పరిమళిస్తే ఇక యుద్ధాలకు తావే ఉండదనీ అంతటి గొప్ప శక్తిని మోదీ నాయకత్వంలో ప్రపంచానికి అందించిన మహా'యోగమే యోగా..' అని తెలిపారు. "పోటీ ప్రపంచంలో తీవ్రమైన ఒత్తిళ్లకు లోనవుతూ బీపీ, షుగర్ వంటి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నామని యోగాతో వాటిని దరి చేరనీయకుండా చేయవచ్చున్నారు. సంవత్సరంలో ఒకరోజు మాత్రమే యోగా చేసి చేతులు దులుపుకునేందుకు ఇది పెళ్లిరోజో, పుట్టినరోజో కాదని గుర్తుంచుకోండన్నారు. ఆరోగ్యం బాగుండాలంటే, టెన్షన్ ను జయించాలంటే నిత్య సంతోషంగా ఉండాలంటే ప్రతిరోజు యోగాను మన జీవితంలో తప్పనిసరిగా భాగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది"అని అభిప్రాయపడ్డారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పని చేయాలి

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆదోని సుగుణ

**కరీంనగర్, జూన్ 21(మనం బ్యూరో) :** స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆదోని సుగుణ అన్నారు. జిలా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆదోని సుగుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా స్థాయి మండల, గ్రామ, బూత్ కమిటీలు వేయాలని పూర్తిస్థాయిలో కార్యవర్గం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళకు వివరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కొత్తగా పది లక్షలకు పైగా రేషన్ కార్డులు అందజేయడంతో పాటు సన్న బియ్యంతో పేదల కడుపు నింపుతున్న విషయాన్ని గర్వంగా ప్రచారం చేయాలని మహిళ కాంగ్రెస్ నేతలకు సూచించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని అన్నారు. జనాభాలో సగం ఉన్న మహిళలు రాజకీయంలో వెనుకబడి ఉన్నారని , స్థానిక సంస్థల ఎన్నికల్లో 50% మహిళలకే సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పదవులను కష్టపడ్డ వారికి పదవులను ఇవ్వాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గం, మండల, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల, జూన్ 21 (మనం ప్రతినిధి) :** విద్యార్థినీ, విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, ఆర్.ఓ. ప్లాంట్, హాజరు పట్టికలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు నూతన మెనూ అమలు చేస్తూ సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యత గల నిత్యవసరాలను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. మూత్రశాలలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నెల 3వ శనివారం రోజున పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, వారందరితో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు గల ఇబ్బందులపై చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థుల పఠన ట్టణ సామర్థ్యాలను పరిశీలించి వారితో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు తమతో పాటు చదువుకుని పాఠశాలకు రానివారిని గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

## స్వశక్తి మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన



**రామగుండం, జూన్ 21 (మనం న్యూస్) :** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం మెప్మా ఆధ్వర్యంలో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట స్వశక్తి మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, వీధి వ్యాపారులచే స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ మేరకు నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పివి రామన్ స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వశక్తి మహిళలు జనపనారతో తయారు చేసిన వస్తువులు, వృధా వస్త్రాలతో మ్యాట్లు తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు. వీధి వ్యాపారులు చిరు ధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించారు. ఈ సందర్భంగా 25 స్వశక్తి మహిళా సంఘాలకు రెండు కోట్ల అరవై లక్షల రూపాయల బ్యాంక్ లింకేజీ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాయక్, జమీల్, ఆర్ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్ఐ శంకర్ రావు, సీనియర్ ఆకౌంటెంట్ రవి తేజ, మెప్మా టిఎంసి రజనీ, సిఓలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, ఆర్పీలు, ఓబిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవనానికి యోగ అవసరం

**కరీంనగర్, జూన్ 21(మనం బ్యూరో) :** అఖిల భారతీయ గ్రాహక్ పంచాయతీ కరీంనగర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా విచ్చేసిన సామాజిక కార్యకర్త దావునూరి మురళి మాట్లాడుతూ మానవ జీవనం ఆరోగ్యం గా ఉండాలంటే జీవితంలో యోగ అంతర్భాగం కావాలని, తద్వారా ఆరోగ్య భారత్ సాధ్యమౌతుందని తెలిపారు.అంతర్జాతీయ యోగ దినోత్సవంను




ప్రపంచం ముందు ఉంచి ప్రపంచ దేశాలను ఏకం చేసే సత్తా భారత్ కి దక్కిందని, తద్వారా భారత్ విశ్వగురు పాత్ర వహిస్తుందని చెప్పారు.మానసిక ఎదుగుదలకు,ఆరోగ్యవంతంగా ఉండడానికి యోగ జీవితంలో ఒక భాగం కావాలి అప్పుడే ఆరోగ్య భారత్ సార్థకం అవుతుంది.అనంతరం యోగ మాస్టార్ సాయిలు కార్యక్రమానికి వచ్చిన వారికి యోగ ఆసనాలు నేర్పించి వాటి ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏబిజిపిబాధ్యులు నాగమల్ల సురేష్, నలువాలా రాజేందర్,జి.సత్యనారాయణ రావు శ్రీధర్, రాంమోహన్, డి. శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్,డి. సంతోష్,సంతోష్, ఐలయ్య, రాంరెడ్డి,శోభరాణి, ఉదయ,సుమలత,అంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాలో 1 లక్షా 44 వేల 307 మంది రైతుల ఖాతాలలో నగదు జమ

- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

**మంచిర్యాల జూన్ 21 (మనం ప్రతినిధి) :** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా 1 లక్షా 44 వేల 307 రైతుల ఖాతాలలో 165 కోట్ల 53 లక్షల 14 వేల 87 రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో



తెలిపారు. జిల్లాలోని 18 మండలాలలోని 419 గ్రామాలలో 1 లక్షా 71 వేల 307 మంది రైతులకు 205 కోట్ల రూపాయల రైతు భరోసా అందించవలసి ఉండగా 1 లక్షా 48 వేల 890 మంది రైతులకు సంబంధించిన 189 కోట్ల 70 లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు పంపించడం జరిగిందని, 1 లక్షా 44 వేల 307 రైతుల ఖాతాలలో 165 కోట్ల 53 లక్షల 14 వేల 87 రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.

## జాతీయం- అంతర్జాతీయం

## యుద్ధంలో అమెరికా చేరితే ప్రతి ఒక్కరికీ ప్రమాదమే : ఇరాన్ మంత్రి

**టెహరాన్, జూన్ 21 :** యుద్ధంలో ఇజ్రాయెల్‌తో అమెరికా జట్టుకడితే ప్రతి ఒక్కరికీ ప్రమాదమేనని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు కొనసాగుతుండడంతో రోజురోజుకు యుద్ధం తీవ్రమవుతోంది. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. యుద్ధం విషయంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై రెండు వారాల్లోగా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ఇజ్రాయెల్‌తో అమెరికా జట్టుకడితే కేవలం ఇరాన్‌కే కాకుండా ప్రతి ఒక్కరికీ ప్రమాదం పొంచి ఉన్నట్లే అని అన్నారు. ఈ యుద్ధం విషయంలో అమెరికా సైనిక ప్రమేయం గురించి ఆ దేశాధ్యక్షుడు యోచిస్తుండడం చాలా దురదృష్టకరమని అబ్బాస్ అరాఘ్చి పేర్కొన్నారు. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి తీసుకోవాల్సిన దౌత్యపరమైన నిర్ణయాలపై చర్చలు జరిపేందుకు యూరోపియన్ విదేశాంగ మంత్రులతో అరాఘ్చి చర్చలు జరిపారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడుతూ..త్వరలో మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అమెరికా ఓ వైపు తమపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు రహస్యంగా మద్దతునిస్తూ..మరోవైపు అణు ఒప్పంద చర్చలకు ఆహ్వానించడం సరైన చర్య కాదని అన్నారు. అగ్రరాజ్యంతో అణు చర్చలు జరపడానికి ఇప్పట్లో తాము సిద్ధంగా లేమని పునరుద్ఘాటించారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడాన్ని ఆపడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ టెహ్రాన్లోని అణుస్థావరాలే లక్ష్యంగా వరుస దాడులకు పాల్పడుతోంది. తమకు ముప్పు పొంచి ఉండడం వల్లే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. దీంతో ఇరాన్ సైతం ఇజ్రాయ్పె క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్హౌస్ (గిజిజ్ఙీ ఏౌఙ్ఖ) నుంచి కీలక ప్రకటన వెలువడింది. ఇర్పా సైనిక చర్య(ఖి ఙజీజూఙ్జీటడఅచ్టిజ్ౌ) చేపట్టే విషయంలో రెండు వారాల్లోగా అధ్యక్షుడు ట్రంప్ (ృ్చిజూఛీ ఖీటఙ్ఖుఇ) నిర్ణయం తీసుకుంటారని వైట్హౌస్ ప్రకటించింది. దీంతో అమెరికా ఈ యుద్ధంలో పాల్గొంటే పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుందని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

## జేడీయూ టికెట్లు అమిత్ షానే ఇస్తారు

- తేజస్వీ యాదవ్ విసుర్లు!



**పట్నా, జూన్ 21 :** బిహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్.. ప్రధాని మోడీ, కేంద్రప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బిహార్లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ.. అధికార, ప్రతిపక్షాలు ప్రచార వ్యూహాల్లో బిజీగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆర్జేడీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రచారాన్ని ఉద్దేశిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని ఇప్పటి వరకు బిహార్లో తన ప్రచారాల కోసం రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు.

"కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు ప్రధాని మోదీ బిహార్లో దాదాపు 200 బహిరంగ సమావేశాలు నిర్వహించారు. ఒక్కో సమావేశానికి సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేశారు. అలా బహిరంగ సభల కోసం రూ. 20 వేల కోట్లు వినియోగించారు...?" అని తేజస్వీ యాదవ్ విమర్శలు చేశారు. "సీఎం నీతీశ్ కుమార్ పరిస్థితి బీజేపీకి వరంగా మారింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ టికెట్లు కూడా కేంద్రమంత్రి అమిత్ షానే కేటాయిస్తారు" అని తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ ఏడాది చివర్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు జనతాదళ్ (యునైటెడ్), ఎన్డీఏ, ఆర్జేడీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

# భారత్- పాక్ యుద్ధం ఆపా.. నాకు నోబెల్ రాదేమో : ట్రంప్ నైరాశ్యం

**వాషింగ్టన్, జూన్ 21 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతి-2026కు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రతిపాదించింది.

భారత్- పాక్‌ల మధ్య తానే యుద్ధం ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ పాతపాటే పాడారు. తాను ఇలా ఎన్ని దేశాల మధ్య యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని ఆయన నైరాశ్యం వ్యక్తంచేశారు. నోబెల్ శాంతి బహుమతి-2026కి ట్రంప్ పేరును పాక్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తన ట్రూత్ సోషల్ వేదికగా పెట్టిన ఓ పోస్టులో ట్రంప్ ఇలా పేర్కొన్నారు.

కాంగో- రువాండా మధ్య అద్భుతమైన ఒప్పందాన్ని ఏర్పాటుచేశానని పేర్కొన్న ఆయన అందుకు తాను చాలా సంతోషంగా ఉన్నానన్నారు. ఇది హింసాత్మక రక్తపాతానికి, పౌరుల మరణాలకు దారితీసిన ఇతర యుద్ధాల కన్నా పెద్దదని, దశాబ్దాలుగా కొనసాగుతుందన్నారు. ఇరువర్గాలు ఒప్పందపత్రాలపై సంతకం చేసేందుకు వాషింగ్టన్‌కు రానున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఇది ఆఫ్రికాకు, ప్రపంచం మొత్తానికి గొప్ప రోజుగా అభివర్ణించారు. అయితే, తాను ఇలాంటివి ఎన్ని చేసినా నోబెల్ బహుమతి లభించదన్నారు. భారత్-పాక్‌ల మధ్య లేదా సెర్బియా-కొసావో మధ్య యుద్ధాలను ఆపినందుకు తనకు నోబెల్ శాంతి బహుమతి లభించదని అసహనం వ్యక్తంచేశారు.

ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి పాక్ ప్రతిపాదించింది. ఈ విషయాన్ని పాక్ ప్రభుత్వం ఓ



ప్రకటనలో తెలిపింది. అందులో భారత్‌పై నోరుపారేసుకుంది. భారత్- ఆపరేషన్ సిందూర్ చేపట్టి.. తమపై దాడికి పాల్పడి ప్రాణ నష్టానికి కారణమైందని ఆరోపించింది. కాగా.. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ట్రంప్ వ్యూహాత్మక దూరదృష్టితో కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చారని పేర్కొంది. నిజమైన శాంతి నిర్మాతగా ఆయనపై ప్రశంసలు కురిపించింది. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కాగా.. పాక్ నోబెల్ శాంతి ప్రతిపాదనను వైట్‌హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ ధ్రువీకరించారు. నోబెల్ శాంతి బహుమతిని ప్రతిపాదించిన తర్వాతే మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చారని తెలిపారు. అణు ఘర్షణను నివారించిన ట్రంప్‌నకు అందుకుతగ్గ ఘనత దక్కిందని అభిప్రాయపడ్డారు.

## ఆ నీళ్లను మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే: అమిత్ షా

**ఢిల్లీ, జూన్ 21 :** పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన నీళ్లను రాజస్థాన్‌కు మళ్లిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. దాయాది గొంతు ఎండాల్సిందేనని అన్నారు. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని వాడుకుంది. ఇకపై ఆ దేశం గొంతు



ఎండాల్సిందే" అని అమిత్ షా అన్నారు.

**మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..**

ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. "నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది" అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోకసభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోకసభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## అతుకులు మనకు.. లాభాలు చైనాకు: మేకిన్ ఇండియాపై రాహుల్ సెటైర్లు

**ఢిల్లీ, జూన్ 21 :** మేక్ ఇన్ ఇండియా వల్ల మనకంటే ఎక్కువగా చైనానే లాభపడుతోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్రం చేపట్టిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. దాని వల్ల మనకు కేవలం అతుకులు మాత్రమే మిగులుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమం వల్ల మనకంటే ఎక్కువగా చైనానే లాభాలు ఆర్జిస్తోందని ఆరోపించారు. దేశంలో తయారీ రంగం తగ్గుతుండడంతో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఢిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 'నెహ్రూ ప్లేస్'లో పర్యటించిన రాహుల్ గాంధీ.. అక్కడ పనిచేసే ఇద్దరు టెక్నీషియన్లతో ముచ్చటించారు. అందుకు సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "మేకిన్ ఇండియాతో ఫ్యాక్టరీ రంగం అమాంతం పెరుగుతుందని కేంద్రం చెప్పింది. మరి ఎందుకు తయారీ రికార్డు కనిష్ఠానికి పడిపోయింది? యువత నిరుద్యోగిత రేటు ఎందుకు భారీగా పెరిగింది? చైనా నుంచి దిగుమతులు ఎందుకు రెండు రెట్లు పెరిగాయి?" అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.



"ప్రధాని మోడీజీ నినాదాలు చెప్పడంలో మాస్టర్.. పరిష్కారాలు చూపడంలో కాదు. 2014 నుంచి తయారీ రంగం మన ఆర్థిక వ్యవస్థలో 14 శాతానికి పడిపోయింది. నిజం నిక్కచ్చిగా ఉంటుంది. అదేంటంటే.. మనం వస్తువులను అసెంబ్లింగ్ చేస్తున్నాం, దిగుమతి చేసుకుంటున్నాం. కానీ, వాటిని తయారుచేయట్లేదు. అందుకే వాటిని తయారుచేస్తున్న చైనా లాభపడుతోంది" అని రాహుల్ విమర్శించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను కూడా నెమ్మది నెమ్మదిగా వెనక్కి తీసుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తయారీ రంగంలో సంస్కరణలు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. "ఇతరులకు మనం మార్కెట్‌గా ఉండకూడదు. ఇక్కడే ఉత్పత్తి చేస్తే.. ఇక్కడే కొనుగోళ్లు చేస్తాం. సమయం లేదు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

## యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది



- ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు

**కౌతాళం జూన్ 21 మనం న్యూస్ :** కౌతాళం మండల పరిధిలోనే ఎరిగిరి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు శనివారం రోజున 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, పాఠశాల చైర్మన్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి, మరియు గ్రామ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా విద్యార్థులకు, గ్రామ ప్రజలకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి మాట్లాడుతూ ఈ యోగా వలన మానసిక ప్రశాంతతను పెంపొందించడానికి యోగ ఎంతగానో సహాయ పడుతుందని వారు తెలిపారు. ప్రతినిత్యం యోగ అనేది జీవితంలో ఒక భాగం చేసుకుందామని యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అలాగే క్రమశిక్షణ,ఏకాగ్రత, జ్ఞాపక శక్తితో పాటు మానసిక ఆనందం పొందవచ్చునని వారు తెలియజేశారు. అదే విధంగా అన్ని వయసుల వారు యోగ చేయవచ్చునని వారు తెలియజేశారు. అలాగే పాఠశాల యందు విద్యార్థులు వేసిన పలు ఆసనాలు ఆకట్టుకున్నాయని ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు,ఫిజికల్ డైరెక్టర్ రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ చైర్మన్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి, గ్రామ టిడిపి సీనియర్ నాయకులు రామలింగ, హోటల్ బసవ,ఏసీ వీరేష్, గ్రామ ప్రజలు,అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ప్రక్రియ అనునిత్యం కావాలి

- జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న 9 లక్షల మంది
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, జూన్ 21(మనం న్యూస్):** మానవ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా ప్రక్రియను అనునిత్యం భాగస్వామ్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డు ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా విశాఖపట్నం నుంచి లైవ్ ద్వారా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి యోగాంధ్ర కార్యక్రమాన్ని వీక్షిస్తూ యోగా ప్రోటోకాల్ ప్రకారం జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, జిల్లాస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు భారీ సంఖ్యలో దాదాపు 5500 మంది హాజరై యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మే 21 నుండి ఈనెల 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగాకు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టమన్నారు. జిల్లా వ్యాప్తంగా 5500 ప్రదేశాల్లో దాదాపు 9 లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారని కలెక్టర్ తెలిపారు. పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయిన ప్రజలందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పతంజలి, రామచంద్ర మిషన్, యోగా చైతన్య మండలి తదితర సంస్థల నుండి యోగా శిక్షకులచే గ్రామ, మండల స్థాయిల్లో అనేకమందికి శిక్షణ ఇచ్చి యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరి చేత యోగాసనాల వేయించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ట్రైనర్ల బృందాలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ మున్సిపల్, మెడికల్ , ఆయుష్ శాఖలు గత నెల రోజుల నుండి యోగ విన్యాసాలలో అవగాహన కల్పిస్తూ ప్రతిరోజు నిర్వహించే పనులు ఆన్లైన్లో నమోదు చేస్తూ ఎప్పటికపుడు ఫోటోలను అప్లోడ్ చేశారన్నారు. యోగా కార్యక్రమం పై జిల్లాస్థాయిలో వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. మన జిల్లాలో తయారుచేసిన వీడియోకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే బనగానపల్లి బృందం తయారుచేసిన స్కిప్టుకు రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి వచ్చిందన్నారు. యోగాంధ్రపై ఆరు ఉత్తమ గేయాలను అప్లోడ్ చేశామన్నారు. యోగేంద్ర కార్యక్రమంలో విజయదుర్గ బృందం వారు భారత ప్రధానమంత్రి మనకి బాత్ కార్యక్రమంలో ప్రశంసా పత్రం అందుకున్నారన్నారు. అలాగే ఆజాద్ కి అమృత్ మహోత్సవంలో వారు రాసిన కవితకు ఆరు లక్షల బహుమతి అందుకున్నారన్నారు. ఎంతోమంది ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 'హెల్తీ - వెల్తీ' గా చూడాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనను ప్రజలలోకి తీసుకెళ్లడానికి జిల్లా యంత్రాంగమంతా కృషి చేసిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాత్రికేయులు, మీడియా ప్రసార మాధ్యమాలు జిల్లా యంత్రాంగానికి ఎంతో సహకరించారని ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యోగా గురువులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ శేషన్న, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి డా. యశోధర, ఆర్డీఓ విశ్వనాధ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, యోగా గురువులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 104 బసాపురంలో ఘనంగా యోగా దినోత్సవం



**ఆదోని, జూన్ 21 (మనం న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 104 బసాపురం గ్రామ పాఠశాల ఆవరణంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎల్ఎల్సీ చైర్మన్ రామస్వామి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, ఎస్ఎంసి చైర్మన్ సత్తన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, పెద్దలు, సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా కార్యక్రమం చేశారు. యోగా శరీరానికి మానసికంగా శాంతి కలిగిస్తుందని, ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా యోగా అభ్యాసం చేయాలని ఆహ్వానం పలికారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామస్థుల నుంచి విశేష స్పందన పొందిందిదని అన్నారు

# కష్టజీవుల కడుపులు నింపే పనికి తూట్లు పొడుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాకాస

**జూపాడుబంగ్లా, జూన్ 21 (మనం న్యూస్):** పేదలు కష్టజీవులకు కడుపు నింపే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు ఆంక్షలు విధిస్తూ నిధులు తగ్గిస్తూన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కు బుద్ధి చెప్పుదామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ. హెచ్చరించారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో శనివారం రోజు ఇసుక వాగు దగ్గర ఉపాధి కూలీల తో కలిసి ఆయన వారి యొక్క సమస్యలు అడిగారు అందుకు ఉపాధి కూలీలు మాట్లాడుతూ 9 వారాలు పనులు చేసిన బిల్లులు రాలేదని పనుల దగ్గర ఎటువంటి వసతులు లేవని ఇప్పటికే చాలాసార్లు చేతులకు కాళ్లకు దెబ్బలు తాకుతున్నాయని తెలిపారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ, మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక



వరం లాంటిదని వీటిని 2005 కు ముందు పేదలు కష్టజీవులు కలిసి వామపక్షాలు సిపిఎం నాయకత్వాన తిండి అయినా పెట్టాలి పనైనా చూపాలి అని పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా. 2005లో వామపక్ష పార్టీల ప్రజా ప్రతినిధులు పార్లమెంటులో 62 మంది సభ్యులు ఉన్నందున ఈ చట్టం తీసుకురావడం జరిగిందని. ఈ చట్టంలో పని అడిగిన వారందరికీ వెంటనే పనులు చూపాలని ఉన్నప్పటికీ వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకుండా పనులు చేసి నెలలు గడుస్తున్న బిల్లులు మంజూరు చేయకపోవడం పనుల దగ్గర రెండు ఫోటోల విధానాలు తీసుకురావడం ఉపాధి పనిని పేదలకు దూరం చేసి పని వెతయ్యడానికి ఒక ప్లాన్ ప్రకారం కుట్రపూరితముగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెయ్యడం జరుగుతుందని వీటిని పేదలు కష్టజీవులు గతంలో ఏ రకంగా పోరాడి సాధించుకున్నామో ఆ విధముగా ఈ పని నిలబెట్టుకోవడానికి మరో పోరాటానికి సంసిద్ధం కావాలనీఆయన తెలిపారు. కులాలకు మతాలకు వర్గాలకు అతీతంగా ఐక్య పోరాటాలకు సంసిద్ధమైనప్పుడే పాలక ప్రభుత్వాలు చట్టంలో ఉన్న కొన్ని టీ నైనా అమలు చేయడానికి ముందుకొస్తాయని అందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పెరిగిన ధరలకు అనుకూలంగా రోజు వేతనం 600 ఇవ్వాలని ప్రతి జాబు కార్డు ఉన్న కుటుంబాలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని పనుల దగ్గర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధు. లింగన్న బుజ్జన్న రాజు మద్దిలేటి కల్పన తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## మొక్కలు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- ఎంపిడిఓ నూర్జ హన్

**మంత్రాలయం , జూన్ 21, మనం న్యూస్ :-** మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని మంత్రాలయం ఎంపీడీవో నూర్జహాన్ అన్నారు . శనివారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో మండల పరిషత్ కార్యాలయం దగ్గర స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్ర రెడ్డి , ఇస్రత్ బాష , వెలుగు అధికారులు పాల్గొన్నారు.

## తెర్నేకల్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో యోగా వేడుకలు



- హై స్కూల్ హెచ్ఎం, ఎస్.జై రాములు

**దేవనకొండ, జూన్ 21, ( మనం న్యూస్):** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్లో యోగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా హై స్కూల్ హెచ్ఎం మాట్లాడుతూ... ఆరోగ్యకరమైన జీవితం కోసం యోగ చేయాలని హై స్కూల్ హెచ్ఎం ఎస్.జై రామ్ పేర్కొన్నారు. మరియు యోగాసనాలు చేయడం వలన శరీరానికి ఉల్లాసాన్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెర్నేకల్ గ్రామ సర్పంచ్, ఎం.అరుణ్ కుమార్, హై స్కూల్ చైర్మన్, వీరేష్, మాజీ విద్యా కమిటీ చైర్మన్, వెంకప్ప, మరియు ఉపాధ్యాయులు, సోమశేఖర్, రమేష్, అనిల్ కుమార్, మరియు ఉపాధ్యాయ బృందం . అలాగే ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చిన్న రాముడు, జనసేన నాయకులు, రాముడు, లక్ష్మన్న, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్



**మంత్రాలయం, జూన్ 21 మనం న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ని మంత్రాలయం తహసీల్దార్ రమాదేవి శనివారం రాంపురం గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసి బోకే అందజేసి శాలువ కప్పి సన్మానించారు. వీరితో పాటు వైస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి , సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు. రైతులు, ప్రజలు తమ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం కు వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేసే విధంగా సేవలందించాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అధికారులకు సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులు

- విశాఖ సీతంపేటలోని స్వగృహంలో పల్లా కుటుంబాన్ని పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి దుర్గేష్
- పల్లా సింహాచలం సేవలు మరువలేనివని తెలిపిన మంత్రి దుర్గేష్



**విశాఖపట్నం, జూన్ 21 (మనం ప్రతినిధి ):** కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ సంతాపం తెలిపారు. శనివారం విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమం పూర్తయిన అనంతరం నేరుగా స్థానిక సీతంపేట లోని రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్వగృహాన్ని సందర్శించి ఆయన తండ్రి సింహాచలం చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళుల ర్పించారు.ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. పల్లా కుటుంబ సభ్యులను దగ్గరుండి ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పల్లా సింహాచలం సేవలు మరువలేనివని, ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘం ప్రతినిధిగా, శాసనసభ్యుడిగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. సుదీర్ఘకాలం ప్రజా సేవకు అంకితమైన పల్లా సింహాచలం విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడమే గాక ప్రజలకు, కార్మికులకు నిరంతరం సేవలు అందించిన గొప్ప వ్యక్తి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో యోగ దినోత్సవం

### ఇంద్రనగర్ రామాలయం వద్ద యోగాసనాలతో ఆరోగ్య సందేశం



**ఆదోని, జూన్ 21: (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రోత్సాహంతో, రాష్ట్రవ్యాప్తంగా యోగా దినోత్సవం విశేషంగా నిర్వహించబడింది. ఈ క్రమంలో ఆదోని టిడిపి మాజీ ఎమ్మెల్యే కొంకా మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, ఇందిరానగర్ టిడిపి వార్డు ఇంచార్జి ఐ.సి. రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు యోగాసనాలు ఎంత అవసరమో ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వివరించారు. స్థానిక టిడిపి కార్యకర్తలు, యువత, సచివాలయం సిబ్బంది, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఐసి, రామకృష్ణ మాట్లాడుతూ - ముఖ్యమంత్రి చంద్రబాబు గారి దిశానిర్దేశంలో ఆరోగ్యపూరిత సమాజ నిర్మాణమే టిడిపి లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి ఒక్కరూ యోగాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్,బాలు యాదవ్, సోమప్పా, భాస్కర్ రాజు,రాజేష్, నరసప్ప, బద్రి, షణ్ముఖ ఆచారి పాల్గొన్నారు.

## యోగా వలన శారీరక మానసిక శక్తిని ఇస్తుంది



- తెర్నేకల్ గ్రామ సర్పంచ్, ఎం అరుణ్ కుమార్

**దేవనకొండ, జూన్ 21,( మనంప్రతినిధి):** యోగ వల్ల శారీరక మానసిక ఉల్లాసానిస్తుందని తెర్నేకల్ గ్రామ సర్పంచ్ మొగతాళి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.శనివారం మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో యోగ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆరోగ్యకరమైన జీవితం కోసం,సమాజం కోసం, యోగ చేయాలన్నారు. భారతదేశ సంస్కృతిలో భాగమే యోగ అన్నారు.ఈ కార్యక్రమంలో, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే యోగ ప్రతి ఒక్కరికి అవసరం



- ఎమ్మార్వో, ఎంపీడీవో

**జూపాడుబంగ్లా జూన్ 21 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని హైస్కూల్ ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను మండల తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపీకృష్ణ, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిసి ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేందుకు, యోగ చాలా ఉపయోగపడుతుందని, యోగ శరీరక మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని, పరిస్థితుల్లో మానవాళికి యోగా చాలా అవసరమని, యోగ చేయడం ద్వారా ఆరోగ్యానికి మించిన ఔషధం లేదని, యోగ వలన సంపూర్ణ ఆరోగ్యం మనశ్శాంతి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు, మన దేశానికి పరిమితమైన యోగా నీ 2014లో ప్రధానమంత్రి మోదీ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. ఈ యోగా దినాన్ని మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా ధ్యానాన్ని పాటించి జూన్ 21వ రోజున 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ జరుపుకోవడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి,మండల రెవెన్యూ అధికారులు, మండల ప్రజా పరిషత్ అధికారులు, హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగినది

## గుడిపాడు గ్రామంలో ఘనంగా యోగ దినోత్సవం వేల్పులగోపాల్

**కర్నూలు, జూన్ 21మనం న్యూస్:** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ గూడూరు రూరల్ మండలం గుడిపాడు గ్రామ సచివాలయం నందు 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవం కార్యదర్శి గట్టన్నఎంపీటీసీ ఎల్లేశ్వరి మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో యోగ నిర్వహించడం అనంతరం అమ్మ పేరు తో ఒక మొక్క నాటడం ర్యాలి నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి హాజరైన అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పులగోపాల్ యోగతొనే ఆరోగ్యం అని ప్రజలందరు యోగ చేయడం ద్వార పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా 100 సంవత్సరాలు జీవించవచ్చని మన పూర్వికులు దీన్ని ఆచరించి చూపించారని మనం కూడ ఆ మహర్షుల అడుగుజాడల్లో నడవలని మన భారత ప్రధాని శ్రీనరేంద్రమోడి ఆంధ్రప్రదేశ్ విశాఖ కేంద్రంగా ప్రపంచ రికార్డు యోగ దినోత్సవాన్ని నిర్వహించారని తెలియజేసారు కార్యక్రమంలో నిలప్ప హోమంత్ డాకన్న ఆనంద్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







## ప్రభుత్వ రాయితీ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**మంత్రాలయం , జూన్ 21, మనం న్యూస్ :-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ రుణాలు పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఓ నూర్జ హన్ , కర్నూలు జిల్లా కెనడా బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల 17 బ్యాంకు మేనేజర్లుతో జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు సేవలపై ప్రజలలో చైతన్యం తేవాలన్నారు. వ్యవసాయ రుణాలు , వాహన ,బంగారు రుణాలు, పొదుపు రుణాలు తదితర రుణాలపై ప్రజల అవగాహన కల్పించి రుణాలు తీసుకునే విధంగా చూడాలన్నారు. ప్రజలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో మంత్రాలయం కెనరా బ్యాంక్ మేనేజర్ ఆళ్లగడ్డ నాగార్జున ఎస్బిఐ మేనేజర్ రాజశేఖర్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ , బరోడా కర్ణాటక బ్యాంక్ మేనేజర్, నాలుగు మండలాల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## యోగా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రాలయం తెదేపా సీనియర్ నాయకులు



**కౌతాళం జూన్ 21 మనం న్యూస్:** శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్వగ్రామం గోతులదొడ్డి నందు నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని పాఠశాల మరియు గ్రామ ప్రజలకు యోగ వలన కలిగే లాభాలు వివరిస్తూ దినచర్య కార్యకలాపాలలో ఒక భాగంగా చేసుకుంటూ జీవన విధానంలో మార్పుకు అలవాటు చేసుకోవాలని మరియు ప్రపంచానికి మనం అందించిన గొప్ప బహుమతి అని తెలియజెయ్యడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర్యులు లక్కే గోవిందు, సతీమణి హనుమంతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కాలు, మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు, పాఠశాల ప్రధానోపాధ్యులు, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

# 'హరిహర వీరమల్లు'
## కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్.. ఎప్పుడంటే?

'హరిహర వీరమల్లు' పార్ట్ 1 కొత్త విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాని జులై 24న రిలీజ్ చేయనున్నట్టు చిత్ర బృందం శనివారం ఉదయం ప్రకటించింది. ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఈ నెల 12న బాక్సాఫీసు ముందుకు రావాల్సి ఉండగా మరోసారి పోస్ట్ పోన్ అయింది.




పవన్ కల్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటం తదితర కారణాలతో ఈ మూవీ షూటింగ్ వాయిదా ఆలస్యమవుతూ వచ్చింది. క్రిష్ కొంతభాగం తెరకెక్కించిన తర్వాత నిర్మాత ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. బిజీ షెడ్యూల్ కారణంగా పవన్ రాత్రి 10 గంటలకు డబ్బింగ్ మొదలుపెట్టి ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేయడం విశేషం. కొన్నాళ్ల పాటు సినిమా సెట్స్ పైనే ఉండటంతో నిర్మాతపై ఆర్థికంగా అదనపు భారం పడిందని భావించిన పవన్.. తాను అడ్వాన్స్ గా తీసుకున్న పారితోషికం మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. 'అసుర హననం' పాటలోని ఫైట్స్ అన్నీ పవన్ కల్యాణే డిజైన్ చేశారని జ్యోతికృష్ణ ఓ సందర్భంలో తెలిపారు. ఈ సినిమా కోసం పవన్ మార్షల్ ఆరట్స్ ప్రాక్టీస్ చేశారు.

ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీలో నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రానుంది.



# ధోనీ రికార్డు బ్రేక్ చేసిన పంత్..

ఐదు టెస్టుల సిరీస్ లో భాగంగా ఇంగ్లాండ్ తో జరుగుతున్న తొలి టెస్టులో భారత వికెట్కీపర్ రిషభ్ పంత్ (134; 178 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సు) శతకంతో విరుచుకుపడ్డాడు. 65 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రిషభ్ పంత్ 146 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. షోయబ్ బషీర్ వేసిన 99.1 ఓవర్కు సిక్స్ కొట్టి టెస్టుల్లో ఏడో సెంచరీ అందుకున్నాడు. 99 పరుగుల వద్ద సిక్స్ కొట్టి మూడంకెల స్కోరు అందుకోవడం విశేషం. ఈ క్రమంలోనే పంత్.. ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. టెస్టుల్లో అత్యధిక (7) సెంచరీలు చేసిన భారత వికెట్ కీపర్ గా రికార్డు సృష్టించాడు. 27 ఏళ్ల పంత్ ఇప్పటివరకు టెస్టుల్లో ఏడు సెంచరీలు చేయగా.. ఇందులో ఐదు విదేశీ గడ్డపై చేసినవే కావడం గమనార్హం.

ఇక, మ్యాచ్ విషయానికొస్తే 359/3తో రెండో రోజు ఆటను మొదలుపెట్టిన భారత్.. భోజన విరామ సమయానికి 454/7తో నిలిచింది. రవీంద్ర జడేజా (2) క్రీజులో ఉన్నాడు. 127 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కెప్టెన్ శుభ్ మన్ గిల్ (147; 227 బంతుల్లో) వద్ద ఔటయ్యాడు. ఐపీఎల్ లో అదరగొట్టి చాలా కాలం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ నిరాశపర్చాడు.

నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్ గా వెనుదిరిగాడు.బెన్ స్టోక్స్ వేసిన 105 ఓవర్ లో చివరి బంతికి షార్ట్ కవర్ లో ఓలీ పోప్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడం పెవిలియన్ కు చేరాడు. కాసేపటికే పంత్ ని జోష్ టంగ్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కిపంపాడు. శార్దూల్ ఠాకూర్ (1) కూడా విఫలమయ్యాడు. బెన్ స్టోక్స్ వేసిన 108.4 ఓవర్కు వికెట్ కీపర్ జేమీ స్మిత్ కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత లంచ్ బ్రేక్ ప్రకటించారు.



## బుమ్రా, హర్షిత్ రాణా వల్లే బ్యాటింగ్ లో రాణించా: యశస్వి జైస్వాల్

టీమ్ఇండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇంగ్లాండ్ తో భారత్ కు జరుగుతున్న మొదటి మ్యాచ్ లో దుమ్మురేపాడు. 159 బంతుల్లో 101 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ (42)తో కలిసి మొదటి వికెట్ కు 91 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రాహుల్ పెవిలియన్ కు చేరిన తర్వాత వెంటనే సాయి సుదర్శన్ (0) ఔటైనా... నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన కెప్టెన్ గిల్ తో కలిసి ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించి, 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే యశస్వి జైస్వాల్ ఇండియా అ తరఫున ఇంగ్లాండ్ లయన్స్ పై ఆడిన రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్ ల్లో అనుకున్న స్థాయిలో పరుగులు చేయలేదు. ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్ కు ముందు టీమ్ఇండియా ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ఆడింది. ఇందులో మాత్రం యశస్వి రాణించాడు. తన బ్యాటింగ్ మెరుగుపడటానికి జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా బౌలింగే కారణమని ఇంగ్లండ్ తో నిన్నటి మ్యాచ్ లో మొదటి రోజు ఆట ముగిసిన అనంతరం జైస్వాల్ అన్నాడు. బీసీసీఐ ఇంటర్వ్యూలో ధ్రువ్ జురేల్ తో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నాడు. 'ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ లో బుమ్రా, హర్షిత్ రాణా అద్భుతంగా రాకెట్ వేగంతో బౌలింగ్ చేశారు. అయితే నేను నా వికెట్ కాపాడుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చా. నాలో ఆత్మవిశ్వాసం పెరిగాక, పరుగులు రాబట్టేందుకు ప్రయత్నించా. అందులో విజయం సాధించా. మేం లీడ్స్ లో అడుగు పెట్టడానికి ముందే చాలా ప్రాక్టీస్ చేశాం. నేను చాలా నేర్చుకున్నా. కేఎల్ రాహుల్ తో కలిసి ఓపెనింగ్ చేయడం నాకు ఉపయోగపడింది. అతడు చాలా ఎక్స్పీరియన్స్ ఉన్న ఆటగాడు. ఇండియా అ తరఫున కూడా ఇద్దరం కలిసి ఆడాం. నేను బ్యాటింగ్ లో ఏమాత్రం తొందరపడలేదు. షాట్లు ఆడటానికి చాలా టైం తీసుకున్నా. ఎంత ఎక్కువ సమయం వీలైతే అంత సమయం పాటు బ్యాటింగ్ చేయాలని మానసికంగా నన్ను నేను సిద్ధం చేసుకోవడానికి ప్రయత్నించా' అని జైస్వాల్ వివరించాడు.



# నా శరీరం.. నా ఇష్టం

తనకి సంబంధించిన ఏ విషయాన్నైనా ఉన్నది ఉన్నట్లుగా చెప్పేందుకు ఇష్టపడుతుంటుంది నటి శ్రుతిహాసన్. తన ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న విషయాన్ని ఎన్నో ఇంటర్వ్యూల్లో స్వయంగా పంచుకున్న ఆమె ఇదే అంశంపై మరోసారి తనదైన శైలిలో స్పందించింది. ''టీనేజ్లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చేది కాదు. అందుకే సర్జరీ చేయించుకున్నా. అలాగే ముఖం మరింత అందంగా కనిపించేందుకు ఫిల్లర్స్ కూడా వాడా. దీంట్లో దాచుకునేది ఏమీ లేదు. నేను ఎన్నో సందర్భాల్లో ఈ విషయాల్ని చెప్పా. కొందరు వీటిని బయటకు చెప్పడం ఎందుకని దాచుకుంటారు. నేను వాళ్ల అభిప్రాయాల్ని గౌరవిస్తాను. కానీ, నాలా ధైర్యంగా చెప్పుకునే వాళ్లనూ తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఏమో భవిష్యత్తులో వయసు పైబడ్డాక ఫేస్ లిఫ్ట్ కూడా చేయించుకుంటానేమో. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. నా శరీరం నా ఇష్టం. ఇతరులకు ఇబ్బంది లేనప్పుడు దాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఏముంది'' అని శ్రుతి తన అభిప్రాయాన్ని పంచుకుంది. ప్రస్తుతం ఆమె రజనీకాంత్ తో 'కూలీ'లో నటిస్తోంది. ఇది ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది.

# అర్హా యోగాసనం..
## చూస్తూ కూర్చుండిపోయిన ఐకాన్ స్టార్

జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్నారు. రాజకీయ నాయకులు మొదలుకొని సినిమా స్టార్స్ వరకు అందరూ ఈ యోగా దినోత్సవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, తెలుగు రాష్ట్రాల్లో ఈ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. ఏపీలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ యోగా దినోత్సవ వేడుకలో పాల్గొన్నారు.



అయితే, ఇలాంటి యోగా దినోత్సవం రోజును అల్లు ఫ్యామిలీ కూడా గ్రాండ్ గా జరుపుకుంటుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూతురు అల్లు అర్హ యోగాసనం చేస్తున్న ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అర్హ యోగా చేస్తుండగా.. తన కూతురు చేస్తున్న యోగాను అల్లు అర్జున్ అలా చూస్తూ కూర్చుండిపోయాడు. అయితే, ఇది పాత ఫోటో అయినప్పటికీ, యోగా డే సందర్భంగా అభిమానులు దీనిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

# ఇతరుల మాటలు పట్టించుకోవద్దు..
## – సమంత

ఇన్ స్టా వేదికగా సందేశాత్మక పోస్ట్ పంచుకున్నారు నటి సమంత. ఇతరుల మాటలతో మానసిక ప్రశాంతత దెబ్బ తీసుకోవద్దంటూ ఇన్ స్టా స్టోరీస్ లో రాసుకొచ్చారు. ''ఇతరుల మాటలను పట్టించుకోకుండా నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఏదైనా జరగనీ అన్నట్లు ఉంటే ప్రశాంతత రాదు.. దాని కోసం నిరంతర సాధన అవసరం. ప్రశాంతతను ఆస్వాదించాలి గానీ.. దానితో పోరాడొద్దు. జరగాల్సిన దాన్ని జరగనివ్వాలి. 'నేను చేయాల్సింది' అనే భావనను 'నేను తప్పకుండా చేయాల్సిందే' అనే విధంగా మార్చుకోవాలి. మనసు వేగంతో కాదు.. నిశ్చలత్వంతో ప్రశాంతంగా మారుతుంది. మనం పెట్టుకునే సరిహద్దులు ఆత్మగౌరవంలో భాగమే. అంతేగానీ.. ఒత్తిళ్లు గౌరవానికి అవరోధం కాకూడదు. మీ శక్తిని తీసుకోవడానికి ఎవరూ అర్హులు కాదు'' అని ఆమె రాసుకొచ్చారు. అయితే ఆమె ఉన్నట్టుండి ఈవిధంగా మానసిక ప్రశాంతత గురించి పోస్ట్ ఎందుకు పెట్టారో తెలియరాలేదు.



వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలతో సమంత కొన్నిరోజుల నుంచి వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె రిలేషన్ లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. వృత్తిపరమైన పనుల రీత్యా ఇటీవల ఆమె దుబాయ్ కు వెళ్లారు. వెకేషన్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. ఆమెతో రాజ్ నిడిమోరు కూడా ఉన్నారనే కామెంట్స్ వచ్చాయి. మరోవైపు, రాజ్ సతీమణి శ్యామాలి కూడా వరుస సందేశాత్మక పోస్టులు షేర్ చేస్తున్నారు. కర్మ సిద్ధాంతం, నమ్మకం గురించి సందేశాలు పంచుకున్నారు. ''నమ్మకం అనేది అన్నిటికంటే విలువైనది. ఒకసారి దాన్ని కోల్పోతే ఎన్ని ఆస్తులు పెట్టినా తిరిగి పొందలేరు'' అనే సందేశాన్ని ఇటీవల ఇన్స్టా స్టోరీస్ లో పోస్ట్ చేశారు.



# ఆయన వల్లే ఇదంతా సాధ్యమైంది
## – రష్మిక

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటించారు. సమీరా పాత్రలో ఒదిగిపోయి నటించారామె. సినిమాలో తన పాత్రకు వస్తోన్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని రష్మిక తాజాగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. శేఖర్ కమ్ముల వల్లే తాను ఆవిధంగా యాక్ట్ చేయగలిగానని అన్నారు. ''శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర'లో సమీరా పాత్రలో నటించా. ఆయన వల్లే సమీరా పాత్రలో ఆవిధంగా ఒదిగిపోగలిగాను. వృత్తిపై ఆయనకున్న ప్రేమ తన సినిమాల్లో ఎప్పుడూ కనిపిస్తుంటుంది. అందుకే ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. 'కుబేర'తో నాకు అవకాశం దొరికినప్పుడు.. ఒక నటిగా ఆయన నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అందుకే ఆయన చెప్పినవిధంగా ప్రతి సన్నివేశంలో యాక్ట్ చేయగలిగాను. ఆయన వల్లే ఈరోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కుతున్నాయి. అద్భుతమైన నటీనటులతో పనిచేసినప్పుడు వారికి సమానంగా యాక్ట్ చేయాల్సిన బాధ్యత ఉంటుంది. ధనుష్ లాంటి గొప్ప నటుడు పక్కన యాక్ట్ చేస్తున్నప్పుడు.. ప్రతి సీన్ లో శ్రమించాల్సిందే. దేవాతో కలిసి సమీరా పాత్రలో నటించినందుకు ఎంతో సంతోషిస్తున్నా. నాగార్జున సర్ గురించి చెప్పడానికి మాటలు సరిపోవు. ఆయన నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ది బెస్ట్. ఆయన జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ సినిమాలో భాగమైన టీమ్ అందరికీ, నా అభిమానులకు, సినీ ప్రియులకు ధన్యవాదాలు. సమీరా.. ఒక అందమైన గందరగోళం లాంటిది. సినిమా చూసిన తర్వాత నేను ఎందుకు ఇలా చెబుతున్నానో మీరే అర్థం చేసుకుంటారు'' అని ఆమె రాసుకొచ్చారు. ప్రతిఒక్కరూ వీక్షించాల్సిన చిత్రమిదన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.